
KĀLAGEETHI (Long Poem)


Dr.N.R. Venkatesham
















కాలగీతి



డా॥ ఎన్.ఆర్. వెంకటేశం

కాలగీతి

(దీర్ఘ కవిత)

డా॥ ఎన్.ఆర్. వెంకటేశం

దివ్య దీప్తి ప్రచురణలు

హైదరాబాదు

2006

KĀLA GEETHI
Long Poem

By
Dr. N.R. VENKATESHAM
M.A., M.Phil., Ph.D.
Associate Professor
Department of Telugu
Osmania University
Hyderabad - 500 007.

Publication No. 9

First Edition : **2006**

Copies : 500

Price : **Rs. 80/-**

For Copies:
N. VIKRANTH M.A.
H. No. 18-2-192/2,
Jangammet, Falaknuma,
Hyderabad - 500 053
Mobile : 9346502342

Designed & Printed at : **SRI SAI PROCESS**
3-4-612/1, Narayanaguda,
Hyderabad - 500 027.

అంకితం



రసపరిశోధనా పిపాసి

'రసభారతి' నివాసి

విద్యార్థులు మరిచిపోలేని గురువృ

చెలిమి పచ్చదనంతో శోభించే తరువృ

ఎల్లారి శివారెడ్డి గారికి

ఎదలోతుల్లోనుంచి ...

Prof. E. Siva Reddy
M.A. Ph.D. (Telugu) M.A. (Sanskrit) Rtd.

Phone : Res - 27632020

DEPARTMENT OF TELUGU
University College of Arts & Social Sciences
Osmania University Hyderabad - 500 007
Secretary Andhra Saraswatha Parishat.

RASA BHARATI
1-1-336/77 (518), Viveknagar,
Chikkadpally, Hyderabad - 20.

స్వీకారం

ఓ నిదానకవీ!
సురుచిరభావ విస్ఫురద్ రవీ!
నీవు కాలజ్ఞుడవు
నేను రసజ్ఞుడను
మన స్నేహబంధం
పారిజాత సుమగంధం
మన చెరిగిపోని చెలిమికి
ఎల్లలూ కల్లలూ లేవు
ప్రఫుల్ల హృదయంతో
నీ విచ్చిన ఈ కృతితో
సుకృతినైనాను
బదులుగా ఏమివ్వగలను!
అభిమానమందారమాలతప్ప.
లలితరాగాంకిత–అక్షరమాల తప్ప.

ఎల్లూరి శివారెడ్డి

ఇతర రచనలు

1993 వ్యాస ప్రసూనాలు (సాహిత్య వ్యాస సంపుటి)

1993 కందాల మకరందాలు

1994 రాగాభిషేకం (ప్రణయ కవితా సంపుటి)

1995 బుడ్గ జంగాలు (పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసం)

1999 నిజాలూ - నిర్వచనాలూ (300 కవితోక్తులు)

2002 చిలుక పలుకులు (కందపద్య ద్విశతి)

2002 బుడ్గ జంగం దర్శిని (350 పుటల పరిశోధనా గ్రంథం)

2006 వ్యాస వివేచన (12 పరిశోధనా పత్రాల సంపుటి)

స్వరాంజలి

1980 దశకంలో 'కాలం' అనే శీర్షికతో ఒక కవిత రాసి, నచ్చక ఆ కాగితాన్ని చిత్తు కాగితాల్లో పడేశాను. కొన్ని సంవత్సరాల తర్వాత ఆ కాగితాన్ని చూడటం తటస్థించి, ఆ కవిత చదివితే బాగానే ఉందనిపించింది. 'ఆంధ్రప్రభ' దిన పత్రికకు పంపాను. 14-1-1990 సంచికలో చిన్న గడియారం బొమ్మవేసి వారా కవితను ప్రచురించారు. ఆ తర్వాత 'కాలం' మీద దీర్ఘ కవిత రాయాలని నిర్ణయించుకుని, విషయ విభాగం చేసుకుని, అప్పుడప్పుడూ రాస్తూ వచ్చాను. 'కాలానికి నిద్రలేదు' అనే ఖండికను ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు తమ 'చైతన్య కవిత' ఏప్రిల్, అక్టోబర్ 2000 సంచికలో ప్రచురించారు. కొన్ని కవితా భాగాలను డా॥ కమలాకర శర్మగారు 'మూసీ' పత్రికలో ప్రచురించారు. ఆకాశవాణిలో అవకాశం వచ్చినప్పుడల్లా కొన్ని సంవత్సరాలపాటు ఈ దీర్ఘ కవితలోని భాగాలను పఠనం చేశాను. ఈ విధంగా ప్రోత్సాహం అందించిన వీరందరికీ పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు సమర్పిస్తున్నాను.

ఇంత కాలానికి ఈ దీర్ఘ కవిత పుస్తక రూపంలో మీ ముందుకు వచ్చింది.

ఈ సందర్భంగా నా శ్రీమతి లలితకు, చేదోడువాదోడుగా నాకు సహకరించిన మా చిరంజీవులు విక్రాంత్, నీరజ, నిశ్చలలకు నా శుభాకాంక్షలు.

- ఎన్.ఆర్. వెంకటేశం

ఆలాపన

పరిమితమైన శక్తియుక్తులున్న మనిషి - కంటికి కనబడని, ఆద్యంతాలు అర్థం కాని మహాశక్తి అయిన కాలాన్ని జయించటానికి సంతతాన్వేషణతో ఉద్యమిస్తున్నాడు. కాలం తత్త్వం తెలుసుకోవటానికి ఉత్సాహపడుతున్నాడు.

కాలం అనంతంగా సాగిస్తున్న ప్రయాణంలో మనిషి ఎక్కడో ఒక బిందువు వద్ద పుట్టి, జీవించి, కొంతదూరం (జీవిత కాలం) ప్రయాణించి, కాలంలోనే కలిసిపోతాడు. కాలం నిరంతరంగా ముందుకు సాగుతూనే ఉంటుంది. మనిషి జీవనం - భావనం, సుఖం - దుఃఖం, మంచీచెడ్డా, జ్ఞానం, పరిజ్ఞానం - అన్నీ కాలంతో ఏర్పడిన అవినాభావ సంబంధంలో పుట్టేవే!

అలాంటి కాలాన్ని మెచ్చుకోనివాళ్ళుంటారా? ఆ కాలంలో జరిగే ఇష్టంలేని పనుల్ని చూసి నొచ్చుకోనివాళ్ళుంటారా? సమాజ పరిణామాలన్ని కాల ప్రభావాలేనని అననివాళ్ళుంటారా? జీవితంలో అడుగడుగునా కాలం గురించి మాట్లాడుకోని వాళ్ళుంటారా?

మనిషి జీవితానికీ - కాలానికీ ముడిపడివుంది. దేవుడు కాల స్వరూపుడని కాలానికి దైవత్వాన్ని ఆపాదిస్తారు. కాలప్రభావం అంతగా ఉందన్నమాట మనిషి మీద! కాబట్టి కాలం గురించి ఆలోచించని మనిషి ఉండడంటే అతిశయోక్తి కాదు!

ఏ కళాకారుడైనా ముందు మనిషి. మానవత్వం పరిమళించిన మనిషే కళాకారుడవుతాడు. కాలం గురించి కలవరించి, పలవరించి, పరవశించి, వివేచించి, అనేక రూపాలుగా కాలాన్ని దర్శించి, ఆ అనుభూతులను తానెరిగిన కళారూపంలో అభివ్యక్తం చేయటానికి పూనుకుంటాడు కళాకారుడు. కవి ఆ భావాలకు అక్షర రూపం ఇవ్వటానికి సంకల్పిస్తాడు.

కాలం గురించిన నా అనుభవాలకు, ఆలోచనలకు కవితారూప మిచ్చి ఈ 'కాలగీతి'ని ఆలాపిస్తున్నాను. కాలతత్త్వం, కాల స్వరూప స్వభావ ప్రభావాలు, కాల ప్రకోపాలు, కాలమూ-మనిషి, కాలంతో అనుబంధాలు, కాలం - చరిత్ర .... ఇలా అనేక ముఖాలుగా కాలాన్ని దర్శించటానికి చేసిన ఒక ప్రయత్నమిది. అంతటి కాలాన్ని గురించి పాడుతున్న ఒకానొక చిన్న పాట ఇది. ఈ కవితను ఆస్వాదించే నెపంతో మీరూ ఒకసారి కాల జ్ఞానాన్ని అనుభూతి చెందటానికి ఇదే నా ఆహ్వానం.

- ఎన్.ఆర్. వెంకటేశం

హైదరాబాదు.
తేదీ : 06-06-06

విషయ సూచిక

పల్లవి

చలనంలో కాలం జననం
గమనమే కాలం జీవనం
నక్షత్రాలు గ్రహాలకిచ్చిన
నిరంతర గమనాపేక్ష
కాలానికి జన్మనిచ్చింది.
అనంత విశ్వంలో
అగణిత గ్రహాల్లో
అజ్ఞానంగా ఉండిపోయిన కాలాన్ని
మనిషేగదా గుర్తించింది!
కాలాన్ని నిర్వచించింది
కాలం లక్షణాల్ని చెప్పింది
కాలం ఉనికిని చాటింది!

పురివిప్పాక మనిషి మేధ
పూర్తిగా మారింది కథ
తెలివి మీరిన మనిషి
తెలుగులనెన్నో ఆవిష్కరించాడు!

చరిత్రను అధ్యయనం చేస్తుండగా
చరిత్ర సమాంతర గమనశక్తిని
కాలానికాపాదించాడు!
ప్రకృతిని పరిశీలిస్తుండగా
పరిణామశక్తిగా
కాలాన్ని ప్రతిపాదించాడు!
కొలమానంగా వాడుకోవాలని
కాలమానాన్ని సృష్టించాడు!
సృష్టితత్వాన్ని అర్థం చేసుకోవటానికి
స్పష్టమైన సూత్రంగా
కాలాన్ని మలిచాడు!
తదాదిగా - తదేకంగా
అనంతతత్వంగా కాలాన్ని
ఆరాధించసాగాడు
నిత్యచైతన్యశక్తిగా
నీరాజనాలెత్తసాగాడు
కాలాన్ని అర్థంచేసుకోవటమే
నిజమైన జ్ఞానమన్నాడు
కాలజ్ఞానం అనే మాటకు
అపూర్వ విలువల్ని ఆపాదించాడు
భగవంతుడంటే కాలస్వరూపుడని
నిర్వచించేశాడు చివరికి!

పరిణామ క్రమాన్ని
కాలమహిమగా వర్ణించటం
లోతులు చూసే మనిషికి
ఖ్యాతి తెచ్చిన విషయమయింది
మనిషి చేసిన ఈ విశ్లేషణ
మంచి సిద్ధాంతమయింది!
మనిషి నడిచిన పథాలను
మనిషి విడిచిన గతాలను
విజయాలను వికాసాలను
ఆయా దశలను
మానవ్వుని మజిలీలను
వివరించే చరిత్ర
కాలం ధరించిన పాత్ర అయింది!

భూతకాలమంటే చరిత్ర
వర్తమానకాలమంటే నడుస్తున్న చరిత్ర
భవిష్యత్కాలమంటే రాబోయే చరిత్ర
చరిత్ర కాలంలోనే ఉంది
చరిత్రలో కాలముంది.

చరిత్రకూ కాలానికీ
ధరిత్రి మీది మనిషే ఆధారం!
అనంతమైన కాలం రూపాన్ని
అంచెలంచెలుగా చూస్తాడు
కాలాన్ని విభాగించి విభాగించి
చిన్న చిన్న భాగాలు చేస్తాడు
సెకండునే ఖండఖండాలుగా చేస్తాడు
నిమిషాలు గంటలు రోజులని
వారాలు నెలలు సంవత్సరాలని
దశాబ్ద శతాబ్ద సహస్రాబ్దాలని
యుగాలు యుగాలని
సూక్ష్మాతిసూక్ష్మంగా
అతిదీర్ఘ భాగంగా
కాలాన్ని చూస్తున్నాడంటే
గణన చేస్తున్నాడంటే
మానవ జీవితాల్లో
మన్నన కాలానికెంత కల్పించాడో తెలుస్తుంది!
వంద సంవత్సరాలు జీవించే మనిషికి
అనంతకాలం మీద
ఇంత అవగాహన పెరుగుతున్నదంటే
ఎంత జ్ఞానార్జన చేస్తున్నాడో
ఎంత పట్టు సాధించాడో తెలుస్తుంది!

మనిషి నిశితపరిశీలనాశక్తికి
నిలువెత్తు అద్దం కాదా ఇది?
అనామకంగా ఉన్న కాలానికి
అద్భుతజ్ఞానాన్ని అన్వయం చేశాడు
కాలావగాహనను పరివ్యాప్తం చేసి
విలువైన సిద్ధాంతంగా తీర్చాడు
అరూపంగా ఉన్న కాలానికి
సురూపసంవిధానం కల్పించాడు
నిరంతరంగాచెరగని రూపాన్ని
చరిత్ర కాలానికిచ్చేలా చేశాడు.
రవి ప్రభావానికి లోనైన
భువి మీది పరిణామాలు
కాలం షణ్ముఖాలేనని
కళల్లో ఉల్లేఖిస్తూ ఉంటాడు
జీవకోటిలో మార్పులు
జరింపించేది కాలమేనంటాడు
పుట్టిపెరిగి గిట్టటమంతా
కాలధర్మంగా పరిగణిస్తాడు
భూతవర్తమాన భవితలుగా
త్రిమూర్త్యాత్మకంగా
కాలాన్ని దర్శిస్తాడు
త్రికరణశుద్ధిగా విశ్వసిస్తాడు!

బాల్యం - యౌవనం - వృద్ధాప్యం
చిగురాకు - పచ్చటాకు - పండుటాకు
మనిషైనా జంతువైనా
మొక్కైనా చెట్టైనా
కాలంతో సమన్వయించుకుంటాడు
కాలం మార్పులకు
ఆలవాలం తానంటాడు
ఉదాహరణగా ఉంటాడు!
సకల ప్రకృతిలో
కాలవర్ణనలే
పరివ్యాప్తమవుతాయని _
సృష్టి సృష్టంతా
కాలగమనాల
దృష్టాంతాలుగా నడుస్తుందని _
పరిశోధన చేస్తాడు
ఫలితాలను నివేదిస్తాడు !

* * *

ఈ దృష్టితో
కాలాన్ని దర్శించి
చరణాలు చరణాలుగా
'కాలగీతి'ని గానం చేస్తున్నాను
కాలజ్ఞానాన్ని మననం చేస్తున్నాను !

ఒకటో చరణం

ఏకాంతం
కావాలనుకున్నప్పుడు కూడ
నిరంతరంగా _
సృష్టి మీద ప్రవహించే కాలంతో
ఎప్పుడూ _
ఒంటరిగా విడిచిపెట్టని కాలంతో
కలసి ఉండక తప్పదు ఎవరికైనా!
కాలం కన్నుగప్పే
ఏకాంతం ఎక్కడుంటుంది?
ఆ ఏకాంతంలో
స్ఫురణకు వచ్చే
మధురక్షణాలో
దుఃఖపు గడియలో
కాలం తనతో ముడివేసిన
మనుషులకు సంబంధించినవే!
గతం నుంచి వర్తమానం వరకూ
కావలసిన దృశ్యాల్ని
కళ్ళ తెర మీద ప్రదర్శిస్తుంది కాలం!
జీవితంలో తారసిల్లిన ముఖాలు
కదులుతుంటాయి వరుసగా.

వాళ్ళు కనిపిస్తున్నంతసేపూ
హృదయపు గాయాలో
మధురగేయాలో
కనిపిస్తుంటాయి వినిపిస్తుంటాయి.
హృదయశిఖరాల మీదనో
ఎదలోయల లోతుల్లోనో
తేలిపోతుంటాడు మనిషి
తిరుగాడుతుంటాడు.
ఏకాంతంలో ఒక్కోసారి
ఉవ్వెత్తునలేచి ఉక్కిరిబిక్కిరి చేసే
సమస్యలతో సతమతమవుతుంటాడు
పరిష్కారసూచికల్ని పరిశీలిస్తుంటాడు.
సమస్య పర్వతాన్ని
అడుగునుంచి కాక
దాని తల మీది నుంచి వీక్షించి
తలస్పర్శిగా ఆలోచించి
నిర్ణయాల మెరుపుల్ని
నిలుపుకుంటాడు మెదడులో.
అందులోని
నిజానిజాల నిగ్గుతేల్చటానికి కాలం
నిర్విరామంగా పనిచేస్తుంది!

కాలం
మనసును పట్టుకుని
కావలసిన చోట్లకెల్లా
వెళ్ళివస్తుంది క్షణాల్లో.
జీవితంలో అంతవరకూ గడిచిన కాలాన్ని
ఎంతోవేగంగా
దర్శిస్తుంది మనసు.
మనోవేగాన్ని మించింది
మరేముంటుంది గనక!

ఏకాంతప్రాంతంలో
ప్రశాంతంగా కూర్చున్న మనిషిలో
తీయతీయని కేరింతలెన్నో!
మౌనంగా చూస్తున్న మనిషిలో
మూగ భాషల ఘర్షణలెన్నో!
పెదవి మెదపని మనిషిలో
పెనుతుఫాను ఘోషలెన్నో!
నిశ్చలంగా కనిపించే మనిషిలో
రౌద్ర సముద్రముద్రలెన్నో!
కాలప్రభావాలే
మానవ స్వభావాలు కదా!

ఆ ఏకాంతంలో
కళ్ళ ముందరి దృశ్యాలు మసకబారి
మనోచిత్రాలే
మననమవుతుంటాయి.
పరిసరాలు క్రమంగా
మరపు పొరల్లో కూరుకుపోతాయి.
శరీరం
మెల్లమెల్లగా
అదృశ్యమై పోతుంది.
హృదయం ఒక్కటే
బ్రహ్మాండం నిండి
తలపులతో తలమునకలవుతుంది!
అప్పుడు __
ఇహలోక భావాలకావల
ఏమున్నదో చూడాలనుకుంటాడు!
అణుసంపుటమైన మనిషి
అనంతంలో పరివ్యాప్తమౌతాడు
సృష్టిలో భాగమైన మనిషి
సృష్టితత్త్వజిజ్ఞాసువవుతాడు
తాను వేళ్ళూనుకుని ఉన్న లోకానికి
సృష్టితత్త్వాన్ని అన్వయిస్తాడు.

ఇదంతా
హృదయం
కాలాన్ని స్పృశించినప్పుడో
కాలం
హృదయాన్ని స్పర్శించినప్పుడో
జరిగే రసాయనిక చర్య!
అనంత నిమ్నోన్నతాల్లో
అనుభూతులు విస్తరించే క్రియ!
దిగంతాల వలయాల్లో
మనసు ఆవరించే ప్రక్రియ!
ఇది
కాలం ఆద్యంతాల మధ్య ఉన్న దృశ్యాల్ని
ఒక్క చూపుతోనే
అలవోకగా
అవలోకనం చేసే అపురూపజ్ఞానం.
ఇదంతా నిర్వహించేది కాలమే!
మనిషి అనుభూతులకూ
ఆలోచనా వివేచనలకూ
నూతనావిష్కారాలకూ
మూలం
కాలజ్ఞానమే!

మనిషీ - కాలం
అవినాభావ సంబంధంతో
పెనవేసుకుని కొనసాగుతున్న
రెండు అన్యోన్య రేఖలు!
ఒకే దారిలో నడుస్తున్న
బాటసారులు!

కాలం —
మనిషికి పెద్దదిక్కుగా ఉన్న
అనాది శక్తి!
నవనవోన్మేషమైన జ్ఞానాన్ని కలిగించే
ప్రబోధ ప్రగతి !
చిరంతన నిరంతర
చైతన్యగీతి!
సమతను పాటించే
సద్వివేకం!
మనిషిని మార్చుకుంటూ వస్తున్న
నిత్యపరిణామం!
మనిషిని తీర్చుకుంటూ వస్తున్న
సత్య స్వరూపం !

ఎటు చూసినా హిపోక్రసి
మధ్యలో మనిషి!
కష్టాల్లో అందరూ విడిచి వెళ్ళినా
ఆత్మీయస్పర్శతో
కాలం ఒక్కటే కలసి ఉంటుంది!
పుట్టినప్పటినుంచి గిట్టేవరకూ
తోడుగా ఉంటుంది
నీడగా నిలుస్తుంది
గుండె బరువును దించుతుంది
కన్నీటిని తుడుస్తుంది
పన్నీటిని చిలుకుతుంది
వెన్నుతట్టి ఓదారుస్తుంది
కనిపెట్టి దగ్గరకు తీస్తుంది!
మాట్లాడకుండానే
మనిషికి అర్థమవుతుంది!
కనిపించకుండానే
కర్తవ్యాన్ని బోధిస్తుంది!
అనంతమైన నిశ్శబ్దంలో కూడ
కాలం అనుభవాలు చెవుల్లో వినిపిస్తాయి!
అనవరతమైన అదృశ్య స్థితిలో కూడ
తనను నడిపించే కాలం కళ్ళు కనిపిస్తాయి!

అగ్గిని పుట్టించటం మొదలుకొని
ఆ చంద్రునిపై దిగటం వరకూ
విత్తును మొలపించటం మొదలుకొని
వియత్తును శాసించటం వరకూ
అక్షరాలను కూర్చుకోవటం మొదలుకొని
నక్షత్రాలను శోధించటం వరకూ
సంద్రాలను గాలించటం మొదలుకొని
శిఖరాలను అధిరోహించటం వరకూ
మనిషి చేశాడు అన్వేషణ!
మరో సృష్టికి గవేషణ !
జ్వలించే తపనతో
ఫలించే జిజ్ఞాసతో
ప్రకృతిని అర్థం చేసుకుంటూనే
పట్టుకున్నాడు విజయరహస్యాల్ని!
అధీనుడై ఉంటు ఉంటూనే
అధిగమించాడు ప్రకృతినే!
బీభత్సాలు ఎన్ని కలిగినా
భీతిచెందని విక్రమార్కుడు నరుడు!
విజయాలను చరణాలు చరణాలుగా పాడుతూ
కొత్త బాటల్లో ముందుకు వెళుతున్నాడు!
కాలంతో చెట్టాపట్టాలేసుకుని
కదలుతున్నాడు కొత్త గమ్యాలవైపు!

అమ్మకూ బిడ్డకూ ఉన్న సంబంధమే
అనాదిగా
కాలానికీ మనిషికీ ఉన్న సంబంధం.
తొమ్మిది నెలలు మోసినట్లుగా
తొలియుగాలు గడిచాయి.
బోర్లాపడే రోజులు —
పారాడే దినాలు —
నాలుగు కాళ్ళ మీద
నడిచిన దశలు —
తడబడుతూ మెల్లగా లేచి
అడుగులేసే క్షణాలు —
అమ్మగా కాలం నేర్పినవే!
మాతృత్వపు కమ్మదనాలు చిమ్మినవే!
'అమ్మ'తో మొదలైన మాటలు
ఆసక్తితో కాలం నేర్పినవే!
అల్లనల్లన ఆడిన ఆటలు
మెల్లమెల్లగా పాడిన పాటలు
అల్లారు ముద్దుగా
అమ్మగా కాలం నేర్పినవే!

పేగు తెంచుకు పుట్టిన ఆత్మీయత
కడలేని కడుపుతీపి
ఎనలేని అనురాగం
ఏమరని లాలనా పాలనా
అనిర్వచనీయ వాత్సల్యం
కాలానుబంధంలో
అనుభవించిన మనిషి
కాలం అనే అమ్మ ఒడిలో
అంచెలంచెలుగా ఎదిగాడు!

తల్లి రెక్కల కిందికే
వెళ్ళి దాక్కోవా కోడి పిల్లలు!
అమ్మ కమ్మని కంఠాన్ని
అలవోకగా సొంతం చేసుకోవా
కోకిల పిల్లలు!
వనచరం పిల్లలు
వదిలి పెట్టకుండా
అమ్మ ఎదనే వాటేసుకోవా!
కంగారులేకుండా
ఉదరి గర్భకోశాన్ని విడువకుండా
కంగారు పిల్లలు
అమ్మతోనే అంటుకుపోవా!

పిల్లి తన పిల్లల్ని
నోట కరచుకుని భద్రపరచుకోదా!
ఈ తల్లీబిడ్డల అనుబంధం
ప్రకృతి సహజమైన ఆత్మీయబంధం
సృష్టిలో మధురాతిమధురం!
మాయని మమతల పాశం!

అలాగే కాలమూ మనిషి
కలిసే వస్తున్నారు సృష్టిలో !
వీరి బంధం ఆద్యంతం
విడదీయరానిది!
కాలానికీ మనిషికీ ఉన్న సంబంధం
హృదయానికీ ఊపిరికీ
నయనానికీ దృష్టికీ
భూమికీ వృక్షానికీ
వృక్షానికీ ఫలానికీ ఉన్నట్టిదే !

అమ్మలాంటి కాలం
బిడ్డలాంటి మనిషిని
వదిలి వేరుగా ఉంటుందా!
గోముగా అన్నీ నేర్పి
గొప్పవాణ్ణి చేసింది!

వేటను నేర్పింది
అడవులు త్రిప్పింది
అగ్గిని చూపింది
అన్నవస్త్రాలనిచ్చింది
అడవుల నుంచి నగరాలకు
అతణ్ణి నడిపించింది!
అన్వేషణ సాగిస్తూ సాగిస్తూ
అసదృశ విజయాలు సాధించాడు!

ఏకకణజీవినుంచీ
జలచరాల వరకూ
ఉభయచరాలనుంచీ
భూచరాలవరకూ - ఖేచరాల వరకూ
నాల్గు కాళ్ళ నడక
ఆపై రెండు కాళ్ళదనుక
మనిషి అవతరించి
మజిలీలు దాటుతూ ప్రయాణించాడు.
పరిణామక్రమంలో
పరిపరివిధాలుగా
ఎన్నెన్నో దశలు దాటాడు
ఎంతెంతగానో మారాడు !

అవతారకథలు కూడ
అంతే చెబుతున్నాయట!
మత్స్యావతారం - కూర్మావతారం
వరాహావతారం - వామనావతారం
అన్ని అవతారాలూ
మానవుని అసలు పరిణామాన్ని విప్పేవేనట!

అలాంటి మనిషిప్పుడు
అద్భుతమైన మేధోవికాసంతో
కొత్తకొత్త విషయాల్ని త్రవ్వి
ఎత్తుతున్నాడు గంపలకు!
చంద్రమండలం మీద అడుగుపెట్టటం
పాతపరిశోధన !
చంద్రమండలం మీద ఇళ్ళు కట్టటం
కొత్త అన్వేషణ!
గ్రహాంతర పరిశోధనలతో
అహరహం శ్రమిస్తున్నాడు!
కంప్యూటర్లు - రోబోట్లు - బోన్సాయ్‌లు
క్లోమింగుల విచిత్రాలు
టెస్టుట్యూబుల సృష్టులు!
DNA పరిశీలనలు
జీనోమ్ పరిశోధనలు

అన్నిశాస్త్రాల లోతులను
కొత్త కోణాల్లో దర్శిస్తున్నాడు!
మానవ ప్రపంచాన్నే
కనీ - వినీ - ఎరుగని
నవప్రపంచం చేయ పూనుకున్నాడు!

ఎన్ని పరిణామాలు జరిగినా
కాలం ఒడిలోనే!
ఎంతగా మేధ వికసించినా
కాలం బడిలోనే!
జంతువు నుంచి మనిషిగా ఎదిగినా
కాలం సన్నిధిలోనే!
మనిషిగా
జిజ్ఞాసువుగా
అన్వేషిగా
ఎంతటి ఎత్తులు చూసినా
కాలం పెన్నిధిలోనే!
కాలాన్ని వదిలి మనిషి
కదలలేడు నిత్యం!
కాలాన్ని విడిచి మనిషి
కథలు లేవు సత్యం!

రెండో చరణం

కాలం _

సృష్టిని ఆకర్షించి నడిపించే
అసదృశ అదృశ్య అయస్కాంత సూత్రం!
సృష్టి గమన నియమాల
కొలమానపాత్రం!
ప్రకృతిని ఆవరిస్తూ వెళ్ళే
రంగుల ప్రవాహం!
అనంతమైన అనివార్యమైన అనవరతమైన
రమణీయ పరిణామం!
అద్భుతాలు సృష్టించే ఇంద్రజాలం!
విశ్వాన్ని శాసించే శక్తి మూలం!
ఆనందాల ఆవేదనల
అనుభూతులను కలిగిస్తున్న
విస్మయడోల!
మానవుని మేధస్సును కవ్విస్తున్న
ప్రయోగశాల!
కళ్ళు మిరుమిట్లు గొలిపే
జ్ఞానప్రకాశం!
సుళ్ళు తిరిగే ప్రశ్నలకు
దొరకని సమాధానం!

కాలం నిద్రపోదు!
కాలానికి నిద్రలేదు!
కర్మసాక్షి
లోకబాంధవుడు
మండుతున్న అగ్నిగోళం
నిండువెలుగుల చండతేజం
అయిన
సూర్యుణ్ణి కూడ
నిద్రపోనివ్వదు కాలం!
ప్రకృతి పరిణామాలకు
కారణం కమ్మంది సూర్యుణ్ణి!
ప్రాణికోటికి శక్తినిచ్చే
పని చేపట్టుమంది అతణ్ణి!
కాలనియమాలకు
కట్టుబడిన సూర్యుడు !
కాలం మాటను కాదనగలడా ?
నిద్రలేకుండా
నిలిచి పనిచేస్తున్నాడు !
కాలం ఆదేశాలను
కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నాడు!

నిమ్నోన్నతాల ఉపరితలం
పంచభూతాల సంచలనస్థలం
ప్రపంచానికి ఆధారమైన
ప్రకృతికి ఆలంబనమైన
భూమిని నిద్రపోనిస్తుందా కాలం?
భూభ్రమణం చేయుమంది
పరిభ్రమణంతో సాగుమంది!
సూత్రాన్ని పట్టి ఆడించే కాలానికి
ఏమాత్రం ఎదురుచెప్పని భూమి
నిద్రలేకుండా నిరంతరంగా
నియమపాలన చేస్తూనే ఉంది!

నీటినంతా ఒక్క చోటికి చేర్చి
నీరధిగా రూపమిచ్చింది
ప్రాణికోటికి నెలవైన ఆ పారావారాన్ని
నిద్రపోనిస్తుందా కాలం?
నదీప్రవాహాలను
పదిలపరుస్తూ ఉండుమంది
ఆటుపోటులతో
అలల కల్లోలంగా ఉండుమంది!
నిద్రలేకుండా సముద్రం
నియమంగా మేలుకొనే ఉంది!

నిద్రపోని కాలం
కొందరిపై - కొన్నిటిపై
నిర్నిద్రముద్ర వేసింది
సృష్టి కొనసాగటానికి
స్పష్టంగా ఆదేశించింది.
సూర్యుణ్ణి
నిద్రపోనివ్వదు
చంద్రుణ్ణి
నిద్రపోనివ్వదు
భూమిని
నిద్రపోనివ్వదు
సముద్రాన్ని
నిద్రపోనివ్వదు
గాలి
నిద్రపోకుండా సాగాలి
నది
నినదిస్తూ నడవాలి
తరుసంతతి
సంతతం పరివృద్ధిచెందుతూ ఉండాలి!
కాలం నిద్రపోవద్దంటే
కాదనే వాళ్ళున్నారా?

కాని _
మనిషి ఎంత అదృష్టవంతుడో!
కాలం కరుణించి వరమిచ్చింది
మనిషికి మాత్రం నిద్రనిచ్చింది
మహత్తరావకాశం కల్పించింది!
నూతనశక్తిని
ప్రోదిచేసుకోవటానికి
చైతన్యాన్ని
పాదుకొల్పుకోవటానికి
మహత్కార్యాల్ని
సాధించుకోవటానికి
మనిషిని నిద్రనుంచి
మరువకుండా మేలుకొల్పుతుంది!
కాలమిచ్చిన ప్రోత్సాహంతో
అంతులేని ఉత్సాహంతో
ప్రకృతిని
పరిశీలిస్తాడు మనిషి
ప్రతికృతిని
ఆవిష్కరిస్తాడు !

మనిషికి నిద్రనిచ్చి కాలం
మహోపకారం చేసింది.
నిద్రను కాదనకుండా
నియమం చేసింది తిరుగులేకుండా.
నిద్రపోని మనిషిని
నిర్వీర్యం చేసేస్తుంది!
శారీరక మానసిక
శిక్షలు వేసేస్తుంది!
నిద్రలేమికి ఎంత శిక్షో
అతినిద్రకు అంతే శిక్ష !
నిద్రనియమాలు పాటించకుంటే
నిర్దయగా
శాశ్వత నిద్రనిస్తుంది!

పనిచేసి పనిచేసి పగలంతా
పడుకోవాలి రాత్రంతా
శక్తిని ఉద్దీపించే సూర్యుడున్నప్పుడు
శక్తివంచన లేకుండా పనిచేయాలి
భయాన్ని కలిగించే రాత్రివేళ
భద్రంగా నిద్రపోవాలి!

నిద్రలో
అలలు అలలుగా
కలలు వస్తాయి
సంకల్పాలకు
కలలు పూస్తాయి
ఆశయాలు కలలుగా పరిణమిస్తాయి
సాధనలు కలల్ని పండిస్తాయి
నిద్రలో వచ్చే కలలే
జాగ్రదవస్థలో చేసే పనికి ప్రేరణలవుతాయి!

వెంటాడే బాధలే
వేటాడే తప్పులే
వీడని భయాలే
పీడకలలుగా వస్తాయి !
పరమోత్సాహాలైన
పరోపకారభావనలే
ఉన్నతప్రమాణాలైన
ఉదాత్తభావాలే
మధురస్వప్నాలై
ఆదర్శనందనాలుగా నిలుస్తాయి!
సుందర సురుచిర లోకాలుగా వెలుస్తాయి !

కల
భవిష్యద్దర్శనం కావచ్చు !
కృషిచేయగా కృషిచేయగా
సిద్ధిస్తుంది!
కల
జీవితాశయం కావచ్చు!
పనిచేయగా పనిచేయగా
ఫలిస్తుంది!
కల
నూతనావిష్కరణకు కారణం కావచ్చు!
పరిశోధించగా పరిశోధించగా
ప్రకృతిలో ఉన్న ధర్మాన్ని సూత్రీకరించి
ప్రజాసంక్షేమానికి వినియోగించవచ్చు!
కల
మానవజాతికి మలుపు కావచ్చు!
అలుపు లేకుండా శ్రమిస్తే
మలుపు దాటవచ్చు
మజిలీని దాటవచ్చు
మరో యుగాన్ని ప్రారంభించవచ్చు !
చరిత్రలో కొత్తపుట
చరితార్థం కానూవచ్చు!

జాగ్రదవస్థలో వేసుకునే
ప్రణాళికలు కూడ కలలే
నిద్రలోని నిర్నిద్రలోని
ఆశావహ ఆలోచనలూ కలలే!
కలలు కంటేనే
కర్తవ్యం తెలుస్తుంది!
కలలు కంటేనే
ఘనకార్యాలకు రూపకల్పన జరుగుతుంది!
కలలు కంటేనే
లోకకళ్యాణం సాధ్యమవుతుంది!
స్వప్నాలు పండించుకోవటానికి మనిషి
సర్వశక్తులు క్రోడీకరించుకుంటాడు!
మనిషి విజయ పరంపరలన్నీ
కలల సాకారాలే మరి
కలల సాక్షాత్కారాలే అవి!
మానవుడు సాధించిన
మహావిజయాలను
స్వప్నాలుగా అందించింది నిద్ర!
మరి ఆ నిద్రను మనిషికిచ్చింది
నిద్రపోని కాలం!
నిద్ర ఎరుగని కాలం!

అనంతంలో ఈ విశ్వం ఎంత?
విశాలవిశ్వంలో
అసంఖ్యాక నక్షత్రాల్లో
సూర్యుడు ఎంత?
సూర్యుని నుంచి రాలి పడిన
భూమి ఇంకెంత?
భూమి పల్లాల్లో నిండిన
సముద్రం మరెంత?
అగణితప్రాణికోటిలో
అసలు ఈ మనిషెంత?

అంతటి మనిషి ఎంతగా ఎదిగాడు !
అవతరించాడు కృషిగా
ఆలోచించాడు రుషిగా
వివేచించాడు జిజ్ఞాసువుగా
నిలిచాడు నిరంతరాన్వేషిగా
జ్ఞాననేత్రాన్ని ధరించి
త్రినేత్రుడయ్యాడు!
త్రికాలాలను జయించటానికి
త్రివిక్రముడయ్యాడు!
సృష్టిని జయిస్తున్నాడు
చరిత్రను సృష్టిస్తున్నాడు!

నిద్ర లేకుండానే
నిద్రపోకుండానే
కాలం
కలకాలం మెలుకువతో నడుస్తుంది
కర్తవ్యం నెరవేరుస్తూ వెళుతుంది!
పుట్టించటం - పెంచటం - గిట్టించటం
కార్యక్రమాల్ని
పట్టుదలతో చేస్తుంది
చక్రంలోని రుతువుల్ని
సక్రమంగా తిప్పుతుంది!

కాలరేఖ మీద మనిషికి
కనిపిస్తాయి మూడు బిందువులు.
వర్తమాన గిరిశిఖర బిందువునుంచి
ఇటుచూస్తే
భూతకాల భూమి బిందువు వరకూ
స్పష్టాస్పష్ట దృశ్యాలు చూస్తాడు!
భవిష్యదాకాశ బిందువు వైపు
అటుచూస్తే
అంతా శూన్యం
కాదంటే
భావచిత్రాన్ని దర్శిస్తాడు!

బిందువుల్ని చెరిపేస్తూ
ముందుకుపోతుంది కాలం.
రేఖను పొడిగిస్తూ
రేయింబవళ్ళు నడుస్తుంది కాలం.
కాలం మొదటిఅడుగు వేశాకే
కడమ ప్రపంచానికి
దారి తెలుస్తుంది!
నిరాకారశూన్యంలోంచి
సాకారపథాలను వెలికితీస్తుంది!
కాలం అడుగుపడగానే
అదృశ్యాలన్నీ సుదృశ్యాలవుతాయి!
కార్మికుడు గని తొలిచి
లోకానికిచ్చినట్లు
తన అడుగుజాడల్ని
చరిత్రకిచ్చేస్తుంది.
అక్షరమైన కాలయాత్ర నిక్షేపాలను
రక్షించే వాచ్‌మన్ చరిత్ర!
ఆసక్తిగా ఎదురుచూసే చరిత్రకు
సృష్టిరహస్యాలను చూపాలనే
నిరంతరంగా గమిస్తుంది కాలం
నిత్యనూతనంగా కనిపిస్తుంది!

తరానికీ తరానికీ
అంతరాలు సృష్టిస్తుంది కాలం
గతంలోని విలువల్ని
అతి జాగ్రత్తగా జల్లెడపడుతుంది
బాల్య కౌమార యౌవన వృద్ధాప్య దశల
జ్ఞాపకాల లంకెల్ని విడగొడుతుంది
మరపును కలిగించే మందును
మనిషి మెదడుకెక్కిస్తుంది
యువకోత్తేజంతో
కాలాన్ని జయిద్దామని ఉద్యమిస్తే
యౌవనాన్ని లాక్కుని
ముదిమిని పులిమి అదిమివేస్తుంది!

కాలం మీద ముద్రవేసిన వాణ్ణైనా
కలిపేసుకుంటుంది తనలో!
ఆకాశానికి నక్షత్రాల్లా
కాలానికి వాళ్ళంతా కళ్ళే!
అనిమేషం కాబట్టి
అహర్నిశలు చూస్తూనే ఉంటుంది!
గొంతుమీద కత్తిలా మెరుస్తూ
నెత్తిమీద సుత్తిలా నిలుస్తూ
మనిషి మనిషికి మృత్యువై కాపలా కాస్తుంది!

కాలప్రవాహంలో
మనిషి మంచుగడ్డ
కరగనంతసేపే
ప్రత్యేక అస్తిత్వం!
కాలసముద్రం ఒడ్డుమీద మనిషి
కట్టుకుంటాడు కీర్తి పిచ్చుకగూడు
అల వచ్చేంత వరకే
అది నిలుస్తుంది
ఆ తర్వాత
ఆ అబ్ధిలోనే కలుస్తుంది!

కాలసింధువులో
మహాత్ములు
బిందువులు బిందువులుగా కనిపిస్తుంటారు!
కాలమార్గంలో
మహాపురుషులు
మజిలీల్లో
మాయని జ్ఞాపకాలై
ఆదర్శకథలై వినిపిస్తుంటారు!

కాలానిది అనంత పరిధి!
అందులో క్షణమే మనిషి అవధి!!

మూడో చరణం

భూతకాలం వర్తమానంలోకి
వర్తమానకాలం భవిష్యత్తులోకి
ప్రవహిస్తుంటాయి.
పరస్పరానుబంధాలు
అవిరళంగా కొనసాగుతుంటాయి.

అగోచరమైన భవిష్యత్ కాలానికీ
గతమంతా పరుచుకుని ఉన్న భూతకాలానికీ
మధ్యలో జీవించే
పరిమిత కాలమే వర్తమానం —
అది భూమ్యాకాశాలను కలిపే
దిగంతరేఖ లాంటిది.
రెండు మహా పర్వతాల మధ్య ఉండే
కనుమలాంటిది.
రెండు తీరాలకు తాకి ఉండే
నదీజలం లాంటిది.
రెండు భూఖండాలను కలిపే
వారధి లాంటిది.
కంటికీ దృశ్యానికీ మధ్య ఉన్న

పొరలాంటిది.
పల్చటి పారదర్శకపు
తెరలాంటిది.
మనిషి ప్రత్యక్షంగా భావించే
అసలుసిసలు కాలమిది.
కనపడని భవిష్యత్తును
క్రమక్రమంగా కళ్ళముందర నిల్పేది.
భవిష్యత్తును నేడుగా మార్చి
భూతకాలానికి అర్పించేది.
భూతకాలపు పునాది మీద
నిండుగా లేచే ప్రగతి భవనమే
వర్తమాన కాలం!
చిమ్మచీకటి లాంటి
భవిష్యత్తుకూ
మసకచీకటి లాంటి
భూతకాలానికీ
మధ్య
వెలుగులను విరజిమ్మేది!
గతంలో చేసిన
మంచిచెడ్డల ఫలితాలను
మనిషి అనుభవించే కర్మభూమి!

"పాతొక రోత
కొత్తొక వింత" అనే భావనతో
మానవజీవితాన్ని సమ్మోహపరిచే
మంత్రదండం!

గతాన్ని దూరం చేసుకుంటూ
రేపుకు రూపు లేదంటూ
ఆత్మీయాలింగనంతో
మనిషి అభిమానించే కాలం
వర్తమాన కాలం!
అయితే —
కాలమాన పరిభాష
విధించిన పరిధిలో
కదిలేదే వర్తమానం
అదే దానికి ప్రమాణం.
క్షణమైనా దినమైనా
నెలైనా ఏడాదైనా
దశాబ్దం శతాబ్దం ఏదైనా
వర్తమానం అందులోనే
వర్తించగలుగుతుంది.
ఆ ఒక్కటే దానిపేర
అంతవరకూ మిగులుతుంది.

సంవత్సరమైతే
వర్తమాన సంవత్సరం
శతాబ్ది అయితే
వర్తమాన శతాబ్ది.
ఆ కాలపరిధి దాటితే మాత్రం
వ్యవహారం మారుతుంది.
అది భూతకాలమవుతుంది.
జీవనవ్యవధి తక్కువైనా
భావన కాస్తా అస్పష్టమైనా
కాలగతుల్లో ఒకటై
కదులుతున్నది వర్తమానం.
కాదంటే వర్తమానానికి
కాలుపెట్టే స్థలం లేదు!
ఉన్నానని గోలపెట్టినా
ఉనికి మాత్రం అసలు లేదు!
భూతకాలమే భవిష్యత్తును
ఆవరిస్తూ వస్తుంది
క్షణక్షణాన్ని ఆక్రమిస్తూ
శతాబ్దికి పెరగుతుంది
యుగయుగాలను నిల్పుకుంటూ
అనాదిగా నడుస్తుంది!

నేటి వర్తమానం
రేపటి భూతకాలం.
వర్తమాన జీవనదృశ్యాలు
కాలం గడుస్తున్న కొద్దీ
వెనకబడి పోతుంటాయి
కనుమరుగౌతుంటాయి.
భూతకాలం వాటిని
జ్ఞాపకాలుగా మిగిల్చి
ఒకదానిపై ఒకటి పేర్చుకుంటూ
దొంతరలుగా
తీర్చుకుంటూ వెళుతుంది!
భూతకాలం
శిఖరాలకెగిరే ఆనందాలనైనా
అగాధాలకు చేరే ఆవేదనలనైనా
మస్తిష్కమార్గంలో
మైలురాళ్ళుగా నిలుపుతుంది
ఆ అనుభవాలను
జ్ఞానంగా మారుస్తుంది
ఆ అనుభూతుల పట్ల ఇప్పుడు
తాటస్థ్య మానసిక స్థితిని కలిగిస్తుంది.

మనిషిని స్థిమితపరిచి ఇలా
మరో గమ్యాన్ని నిర్దేశిస్తుంది
భూతకాలమిచ్చిన ఈ వరం
మనిషికి మనోబలం!

ఓదార్పునిచ్చి
ఉత్సాహమిచ్చి
విశ్వాసాన్నిచ్చి
వివేకాన్నిచ్చి
విజయాలవైపు నడిచేలా
విస్తృతం చేస్తుంది అవగాహనను
ఎన్నెన్నో ఉదాహరణలను
ఏకరువు పెడుతుంది.
గతాన్ని బోధించి
కర్తవ్యాన్ని సాధించమంటుంది
దృష్టాంతాలతో స్ఫూర్తిని కలిగించి
మనిషి దృష్టినే మార్చేస్తుంది
సరియైన జీవనదృష్టి కలిగిందా
సాదరంగా అదృష్టాన్ని వెలిగిస్తుంది!

కోరికలు నెరవేరుతాయని
ఆశలు తీరుతాయని
ఆశయాలు ఫలిస్తాయని
కష్టాలు గట్టెక్కుతాయని
సుఖాలు ప్రాప్తిస్తాయని
ఆశావహకాలంగా
అహర్నిశలు ఊరించే
అద్భుతకాలం
భవిష్యత్తు!
తనవైపుకు తిప్పుకుని
మనిషిని ముందుకు నడిపించే
ఆకర్షణశక్తి
అయస్కాంతక్షేత్రం!
పొంగులువారే మనిషికి
అధిరోహించబోయే శిఖరం!
క్రుంగిపోయే మనిషికి
సుదూరంగా కనిపించే గమ్యం!
జీవితంలో చేసిన పొరపాట్లను
బతుకులో ఎదురైన అపజయాలను
చక్కదిద్దుకునేందుకు
మరొక్క అవకాశమిచ్చే
నిక్కమైన కాలమే భవిష్యత్తు!

అనుకున్నవి సాధించుకునేందుకు
వాగ్దానాలు నేరవేర్చుకునేందుకు
మంచిని ఆచరించి ఇకనైనా
మనిషిగా మిగులుదామనే
నిర్ణయాలు తీసుకునేందుకు
కారణభూతమయ్యే
కాలమే భవిష్యత్తు!
కళ్ళకు కనిపించకుండానే
కలకాలం ఉండే కాలం
ఎవరికి ఏం జరుగుతుందో
ఎప్పుడూ తెలియనివ్వని కాలం!
మూసిన గుప్పిటిలా
ఉత్కంఠ కలిగించే కాలం
క్రాంతదర్శులకు
కనిపించే కాలం
దూరదృష్టులు
కొంత ఊహించే కాలం
భూతవర్తమానాలు అర్థమయిన జ్ఞానులు
బుద్ధితో దర్శించే కాలం!

ఆలోచించి
అంచనాలు వేస్తారు కొందరు
ప్రయత్నించి
ప్రణాళికలు రూపొందిస్తారు కొందరు
అర్థం చేసుకుని
భవితను వచిస్తారు కొందరు
భూత వర్తమానాలపై
వారి వారి అవగాహనకొద్దీ
నిజానిజాలు తేలుతాయని
రుజువుచేసేది భవిష్యత్‌కాలం!

రేపటి కాలస్వరూపాన్ని
దూరదృష్టి ఎక్స్‌రేలతో దర్శించి
అంచనాల చిత్రాలను
భవిష్యద్వాణిగా రచించేవాడే
త్రికాలవేది!
అతడెంత లోతుగా
భూతకాలాన్ని చూడగలడో
అంత గాఢంగానే
వర్తమానాన్ని అర్థంచేసుకోగలడు
భూతవర్తమాన జ్ఞానావగాహనను ప్రతిఫలిస్తూ
భవిష్యత్తును సంభావించగలడు!

అనంతమైన కాలం ముందు
అశాశ్వతుడైన ఈ మనిషెంతని కాబోలు
అన్నివైపులనుంచి అతని మీదికి
కాలికశక్తులు విజృంభిస్తాయి.
కాలఖండ పరిమితులున్న ఋతువులు
కాలగతులు కదా!
దుర్బలమైన మనిషి మీద
కాలం ఋతుప్రభావాల విన్యాసం
విస్తరింపచేస్తుంది!
ఎండల చేత మండించేసరికి
తాపం చేత దండించేసరికి
విలవిలలాడి పోతాడు
విహ్వలుడైపోతాడు!
తొలకరి వర్షాలకు
పులకరిస్తున్న సమయంలోనే
మన్ను మిన్ను ఏకమయ్యే జడివానలతో
కాలం ఛిన్నాభిన్నం చేస్తుంది బతుకును !
వర్షాలు తగ్గాయిరా బాబూ అనుకునేసరికి
వచ్చేస్తుంది చలి ఉలులాడించే సమయం !
చంకలు లేపనివ్వని చలికి
వంకర్లుపోతాయి కాళ్ళూ చేతులూ!

ఎముకలు కొరికే చలికి
మూలుగలు పీల్చే చలికి
అల్లాడిపోతాడూ
అతలాకుతలం అవుతాడు !
మానవప్రయత్నాలెన్నైనా
మూడు కాలాల ప్రభావం నుంచి తట్టుకోవటం
మనిషికి తరం కాని విషయం !
ఈ మూడు కాలాల దాడి
ఒక్క సంవత్సరంతో పోయేది కాదు
ఒక్కసారితోనే తీరేదికాదు
ప్రాణమున్నంత వరకూ ఏటేటా
పడవలసిందే ఈ బాధ !

కాలం —
జీవితం మీద
చక్రముద్ర వేసింది.
బాల్యం - కౌమారం
యౌవనం - వృద్ధాప్యం
ఇదీ జీవితచక్రం.
చక్రం ఒక చుట్టు తిరిగితే
అయిపోతుంది జీవితం !

"అయ్యో అప్పుడే అయిపోయిందా జీవితం ?
ఇంత వేగంగా చక్రం తిరిగితే
ఏమైపోవాలి మనిషి?
మనిషి జీవితం వంద సంవత్సరాలే
వెయ్యి సంవత్సరాలైతే ఎంత బాగుండునో!"
ఇది జీవితం మీద ఆశ చావని మనిషి ఆవేదన !
జీవితపరమార్థం అర్థం కాని మనిషి భావన!
అందుకే
కాలచక్రం కదులుతున్నదంటే
గుండె అదురుతుంది!

త్రికాలచక్రం కింద నలిగి
అకాలమరణం పాలయ్యేవాళ్లెందరో !
ఆబాలవృద్ధులెవరైనా
అసువులుబాయటం తప్పదు!
కత్తిదెబ్బనైనా తప్పించుకోవచ్చు
ఎండదెబ్బనెవరు తప్పించుకోగలరు!
ఉలిదెబ్బనైనా తప్పించుకోవచ్చు
చలిదెబ్బనెవరు తప్పించుకోగలరు!
ఊళ్ళను ఊడ్చుకుపోయే ఉప్పెన ముందు
ఏ మనుషులాగుతారు?
దాన్ని ఏ బలవంతులు ఆపుతారు?

మూడు కాలాల ప్రకోపంతో
మతులు పోగొడుతుంది
ఋతువుల కొరడాదెబ్బలతో
గతులు చూపిస్తుంది
మనిషెంత దుర్బలుడో
మళ్ళీ మళ్ళీ రుజువు చేస్తుంది
మనిషెంత ప్రభావితుడో
మరిచిపోకుండా గుర్తుచేస్తుంది.
అయినా -
ఎంతకాలం ఇలా చేతులు ముడుచుకు బతకాలి?
అనుభవాలతో
అవాంతరాలను అధిగమించక తప్పదు
దృఢసంకల్పంతో
అడుగు ముందుకు వేయక తప్పదు!
అందుకే
కాలాన్ని జయించటానికి
ప్రయత్నిస్తున్నాడు మనిషి
పట్టుతప్పని అడుగులేస్తూ
మెట్టులెక్కుతున్నాడు
విజయపథాల వైపు
విశ్వాసంతో దూసుకెళుతున్నాడు!

మనిషిలేని కాలం అడవిలోని వెన్నెల!
మనిషిలేని కాలం పికం లేని ఆమని!
చూపుపడని దృశ్యం.
అనుభూతిలేని హృదయం.
మనిషి లేకుంటే కాలానికి గుర్తేది?
మనిషి లేకుంటే చరిత్రకు పనేది?
మనిషే తనకు ఆలంబనమని
మరచిపోని కాలం
మార్పులకు గురిచేస్తూనే
మనిషిని తనతో నడిపిస్తుంది.
ఆరు రుతువుల గతుల్లో
హరివిల్లు వర్ణాలుగా
అవతారమెత్తిస్తుంది.
షడ్వాతావరణాల్లో
పరిణామాల పాలుచేస్తుంది.
ఆరు రుతువుల ఆర్భాటం
మనిషి మీద పోరాటం.

రుతువు రుతువుకు ఒక మార్పు
జీవనగతిలో కొత్త కూర్పు
అది నవరసాలనాట్యహేల
అనిర్వచనీయ భావలీల

ఎదలోపల జ్యోత్స్నసుధలు
బెదిరించే వేడి సెగలు
ఆహ్లాదం ముదం హాయి
బహుబాధలు పగలు రేయి
కంటిలోన నిలుస్తుంది తళుకు
ఒంటిలోన నిండుతుంది వణుకు
హసిస్తాడు - పరవశిస్తాడు
హర్షిస్తాడు - సంఘర్షిస్తాడు
నవరసాల వైవిధ్యం
నరుడు అనుభవిస్తాడు !

మనిషి
కాలంతో కలసి
ఏళ్ళ మైళ్ళు గడిచి
గమ్యం వైపు అడుగులేస్తున్నాడు.
కాలం షట్పది
భ్రమిస్తూ గమించేది!
ఆరుకాళ్ళ మీదే నడక
నడుస్తుంది అనంతాన్ని వీడక !
ఎన్ని యుగాలు దాటినా
ఎప్పుడూ ఆగిపోని నడక
అది అవిశ్రాంతగమనం !
అలసటలేని పయనం !

ఆద్యంతాల అనంతవ్యత్యాసాలతో
కాలఖండాల పరిమితుల్లో
కదులుతాయి జీవులు
అందులో
వందవత్సరాల పరిధిని
అందించింది మనిషికి కాలం!

చలిని సహిస్తూ - వేడిని భరిస్తూ
వానల్లో తడుస్తూ
నడుస్తూ నడుస్తూ ఉండగానే
గడుస్తూ ఉంటుంది ఏడాది వయస్సు!
ఈ వలయగమనం - ఒక చక్రభ్రమణం
ఇది కాలంలో ఒక శకలం !
సంవత్సరాలు సంవత్సరాలుగా ఇలా
సాగుతుంది మనిషి ప్రయాణం !

నిరంతర కాలగమనంలో
మనిషి జీవనంలో
శీతలమలయపవనాల స్పర్శలూ
గ్రీష్మం ఎర్రటెండల సెగలూ

అడ్డంగా వాగులూ వంకలూ
సమతలమార్గాలూ ముళ్ళడొంకలూ
దాటుతూ
ముందుకు వెళుతుండగానే
మనిషిలో
వయసు రంగులు మారుతుంటాయి
మనసులో కొత్త అవగాహనలు
చేరుతుంటాయి !
అనాదిగా నడుస్తున్న కాలానికి
పునాది ఎక్కడో?
అంతానికి ఎపుడు చేరుతుందో
అంతుచిక్కని విషయం !
ఆద్యంతరహితంగా
నిరంతరప్రవాహంగా
నడుస్తూనే ఉంది కాలం
గడుస్తూనే ఉంది!

కంటికి కనబడని కాలానికి
మనిషి శరీరమే ఒక కొలబద్ద !
కాలప్రభావంతో పెరిగే జీవులే
కాలగమనాన్ని చూపే సంకేతాలు!
ప్రకృతిలోని పరిణామాలే
కాలదర్శనానికి సూచికలు !

ఆరు రుతువుల అందాల గతులు
ఆగని కాలగమనానికి గుర్తులు
ఇవి ఆరు తీరుల అలంకారాలు
భూమికి తీర్చే అందాల హారాలు
వాతావరణప్రకారాలు
క్రమాగత ప్రకృతి విలక్షణస్వరూపాలు!

దినమంతా సూర్యుడు నడుస్తాడు
రాత్రంతా చంద్రుడు నడుస్తాడు
కనబడని కాలం
కదులుతున్నట్లు తెలుస్తుంది
నానా నిదర్శనాలతో
నడుస్తున్నట్లు తెలుస్తుంది !

తడిసిన భూమిలోని విత్తనం
పొడుచుకువచ్చింది మొక్కగా
చిగుళ్ళు ఆకులైనాయి
రెమ్మలు కొమ్మలైనాయి
ముడుచుకు వచ్చిన మొగ్గలే
ముచ్చటగా పూలైనాయి
పిందెలు పెరిగిపెరిగి
కాయలుగా మారాయి
కాయలు పళ్ళైనాయి
కాలం నడుస్తుందని చెప్పాయి!

ఆకులు రాలుతాయి
మోడులు చిగురిస్తాయి
ఎండిన కాలువలే
ఏరులై ప్రవహిస్తాయి
మబ్బు మెరుస్తుంది
వెన్నెల విరుస్తుంది
చలి వణికిస్తుంది
మంచుకురుస్తుంది !

గాలి రూపం కంటికి కనబడదు.
ప్రకృతి కదలికల ద్వారానే గాలి ఉనికి
జ్ఞానయవనికల్ని స్పృశిస్తుంది!
కాలమూ అంతే !
రుతువుల గుర్రం మీద పరుగులు తీసే
అదృశ్యరౌతు కాలం!
కొత్త కొత్త రంగుల మేళవింపుతో
ప్రకృతి చిత్రాల్ని మారుస్తూ
పరిణామాన్ని సూచించే
అద్భుతమైన కుంచెను పట్టిన కాలం
అదృశ్యచిత్రకారుని తలపిస్తుంది!
చరాచరాల జీవితచక్రాల్లోని
సృష్టి స్థితి లయలు కాలయోగాలే కదా!
కాలం చేసే ప్రయోగాలే కదా!
రూపంలేని కాలం
ప్రకృతి రూపాల్ని
పరిణామానికి గురిచేయటం విడ్డూరం!
జడాలకూ చరాలకూ
సృష్టి సర్వాణుసంపుటాలకూ
కంటికి కనబడకున్నా
అవగాహనకు వచ్చే - అనుభూతులనిచ్చే
ఏకైక అరూపభావం కాలం!

నాల్గో చరణం

కాలం గురించి తెలుసుకోవాలంటే
చరిత్రను అడగక తప్పదు !
అవనిని అహర్నిశలు
అవలోకిస్తూనే ఉంటుంది చరిత్ర.
కాలం కథల్ని చెప్పకుంటూ
కలకాలం జీవిస్తుంది.
కాలాన్ని కనిపెట్టుకుని
కాలవృత్తాలను
కరిగిపోకుండా రికార్డు చేస్తుంది.
కాలగర్భంలో
కలిసిపోయిన ఘట్టాలను
భద్రంచేసి
భవిష్యత్తుకందిస్తుంది.
కాలం గమించిన దూరాల్ని
కొలిచి భాగాలుగా చేస్తుంది.
వర్తమానాన్ని విశ్లేషించి
భవిష్యత్తుకందిస్తుంది.
భూతవర్తమానాల అనుభవంతో

భవిష్యత్ గమనాలను అంచనా వేస్తుంది.
వర్తమానంలో వర్తింపచేస్తూనే
భూతకాలంలోకి
ఆలోచనాలోచనాలను
ప్రసరింపచేస్తుంది.
గతకాలపు అక్షరదృశ్యాలను
సజీవంగా ప్రదర్శిస్తుంది.
స్థిరపరిచి సంఘటనలను
చిత్తాలకెత్తుతుంది.
కాలఘటనలకు భాష్యం చెబుతున్న
కాలగమనాలకు వివరణలిస్తున్న
కాలజ్ఞానప్రదాత చరిత్ర!
విలువల్ని తేల్చే విజ్ఞాని చరిత్ర !

నడుస్తున్న కాలం రైలును
గమనిస్తున్న గార్డు చరిత్ర.
తరాల గ్రామాలనైనా
యుగాల స్టేషన్లనైనా
వచ్చిన ప్లాటుఫారాలనైనా
వర్తమానం పెట్టెలనైనా
నిఘావేసి చూడటమే పని!
నిజాలను తెలుసుకోవటమే పని !

ప్రయాణీకులుంటేనే
రైలు పనికివస్తుంది.
మనుషులుంటేనే
కాలం ఉనికి తెలుస్తుంది.
కాలం మనుషుల
కలయిక ఉంటేనే
చరిత్ర మనుగడ ఉంటుంది!

కాలమూ చరిత్ర
వడ్లగింజలో బియ్యపు గింజ.
మామిడిచెట్టూ మాధవీలత.
అనంతాకాశం నీలవర్ణం.
కాలానికి నీడలా
నడుస్తుంది చరిత్ర.
గతానికి మేడలా
నిలుస్తుంది చరిత్ర.
కాలవృక్షం మీద జీవించే
భూతవర్తమాన బదనిక
సుదూరతీరాలను చూపించే
పారదర్శక యవనిక !

అనివార్య ప్రభావం
కాలం సొత్తు.
అనిశం ఆ కాలంతో
చరిత్రకు పొత్తు.
సృష్టి మీద ప్రవహించే కాలానికి
దృష్టంతా వర్తమానం మీదనే!
పరిశీలనే ప్రాణంగా నడిచే చరిత్రకు
గతమంతా భద్రపరిచే అంశమే!
గతంలోని ఘట్టాలను
ఫ్రేముల్లో పెడుతుంది.
మరిచిపోని మతలబుల్ని
సురక్షితం చేస్తుంది.
మానవ సంస్కృతి దశల్ని
మజిలీలుగా తీర్చుతుంది.
జీవనవికాసపు పుటల్ని
భావికి అందిస్తుంది.
నిజమైన చరిత్ర అంటే
నిగ్గుటద్దం కాలానికి!

శిఖరాల మీది
శిలావిగ్రహాలు కొందరు —
స్థూపాలకెక్కిన
సుచరితులు కొందరు —
కుడ్యఫలకాల మీదికి కీర్తిని
కూర్చినవాళ్ళు కొందరు —
శాసన లేఖనాల్లో
ఆసనమేసిన వాళ్ళు కొందరు —
నీటిరాతల్లోనే
నిలిచిన వాళ్ళు కొందరు —
చరిత్ర సృష్టించిన వాళ్ళ
చిత్రాలూ చిరునామాలూ
కాలంతో పయనిస్తాయి!
కథలు కథలుగా వినిపిస్తాయి!
కాలం గడుస్తున్న కొద్దీ అవి
క్రమంగా వెనకబడుతుంటాయి!
కాలగర్భంలో కలిసిపోతూ
కనుమరుగవుతుంటాయి!
కొన్ని చెరిగిపోతుంటాయి
కొన్ని తరిగిపోతుంటాయి!

ఎక్కువగా కొన్ని - తక్కువగా కొన్ని
మసక బారుతూనో
కాంతి వెదజల్లుతూనో
ఆయా వ్యక్తుల ప్రభావాల
ప్రభల్ని కొలుస్తుంటాయి !
కాలం ప్రతిచర్యలో
కరిగిపోవటానికి
వెనకాముందులుగా
వంతులు వేసుకుని
ముందుకొస్తుంటాయి!
ఎంతకాలం ఎవరి చిత్రం వెలగాలో
ఎప్పుడెప్పుడు ఎవరిపేరు తొలగాలో
కరెక్టుగా కాలమే నిర్ణయిస్తుంది !
కాలప్రమాణం నిజంగా
పక్షపాతంలేని పక్షిగమనమే !
సముచిత సంభావనా విచక్షణమే !
యోగ్యతల సమతులనమే !
అన్యాయాక్రమాల జోలికిపోని
పరాక్రమమే కాలం !
తరాలను యుగాలను ముందుకు నడిపే
సక్రమమే కాలం !

సమాజంలో
ఆదర్శాన్ని నిలపటానికి
బంగారంలాంటి వ్యక్తుల్ని
బాధల రాపిడిపెట్టే
ఒరపిడిరాయి కాలం!
నీతి నిలువటానికి
మానవజాతి వెలగటానికి
దూరదూరాలకు కనిపించే
మానవతాశిఖరాల్లాంటి
మహానుభావుల చరిత్రల్ని
మరువకుండా కాపాడుతుంది!
తెలివితేటల్ని ఆవిష్కరించి
వెలుగుబాటలు చూపేవారిని
వేల సంవత్సరాలైనా
కాలం
ఫాలం మీద తిలకంలా ధరిస్తుంది!

సూర్యుడు —
తాను కనబడీ కనబడక
పగలూ రాత్రిగా
విభజించాడు ఒక రోజుని !
చంద్రుడు —
తన గమన వైవిధ్యంతో
శుక్లకృష్ణపక్షాలుగా
చేశాడు ఒక నెలని !
ప్రకృతి
ఆరు రుతువులుగా
మూడు కాలాలుగా
చేసింది ఒక సంవత్సరాన్ని !
మనిషి —
తరం తరంగా
కొలిచాడు కాలశకలాన్ని !
చరిత్ర —
యుగం యుగంగా
గుర్తించింది కాలం భాగాల్ని !
ఇలాంటి కాలఖండాల్ని కలుపుకుని
అఖండంగా ముందుకు సాగుతుంది కాలం
ఆది నుంచి అనంతం వైపుగా
అనుక్షణం కదులుతూనే ఉంది !

ఆ కాలఖండాల్లో వెలుగుతూ
ఎవరి పరిధిలో వాళ్ళు
శిఖరాలు శిఖరాలుగా
కనిపిస్తారు మహానుభావులు !
ధరిత్రి మీద
చరిత్ర సృష్టించినవాళ్లు
తరానికి తరానికి
తారసిల్లుతుంటారు !
యుగాన్ని జయించిన మహాపురుషులు
జగాన్ని ప్రభావితం చేస్తుంటారు !
అమరప్రేమలో జీవించినవాళ్ళు
అసమానపరాక్రమంతో
విక్రమించినవాళ్ళు
అన్యాయాలను
బుగ్గిచేసిన
అగ్గిపుల్లలాంటి వాళ్ళు
అక్రమాలను అంతంచేసిన
పరాక్రమార్కులు
విశ్వాన్వేషణలో
విజ్ఞానకాంతుల్ని ప్రసరించినవాళ్ళు
కాలంతో నడుస్తూ
భవిష్యత్ దూరాల్ని దర్శించినవాళ్ళు

మానవత్వాన్ని
మహోన్నతంగా ఆరాధించినవాళ్ళు
మానవుని శ్రేయస్సుకోసం
మహితాత్ములై కృషి చేసిన వాళ్ళు
అసాధారణవ్యక్తులు
అసామాన్యవ్యక్తులు __

కాలాన్ని జయించిన వీళ్ళు
కలకాలం వెలుగుతుంటారు !
తరతరాలుగా
ప్రజల నోళ్ళల్లో నిలిచి
యుగయుగాలుగా జీవిస్తుంటారు !
మానవ జీవనవికాసానికి వీళ్ళు
మార్గాలను నిర్దేశిస్తుంటారు !
కాలం పొరల్లో కలిసిపోకుండా
వీళ్ళ కీర్తికాయం
కాలం ధరించే కలికితురాయిలో
మణిగా మెరుస్తుంది!
కాలగర్భంలో కలిసిపోయినా
వీళ్ళు
కాలాతీత వ్యక్తులే !

ఆగమంటే
ఎగిరే గద్దైనా ఆగాలి!
నడవమంటే
అనూరుడైనా నడవాలి !
మాట కాదంటే
తాట ఒలుస్తాడు !
ఎదరు తిరిగితే
కొరడా ఝుళిపిస్తాడు !
గుడ్లురిమి చూస్తే
గుండెలు పగలాలి !
కనుసన్న చేశాడా
కంఠం తెగాలి !
గడగడలాడింది జనం !
గజగజ వణికింది లోకం !
అతడు చెప్పిందే ధర్మం !
అతనికొప్పిందే న్యాయం !

నేనే దేవుడన్నాడొకడు
నాకు ఎదురులేదన్నాడొకడు
దారుణరణాలు చేశారు
మారణహోమాలు నడిపారు
రాజ్యాలను పాలించారు
రక్తపుటేరులు పారించారు
కయ్యానికి కాలుదువ్వి
హుంకరించారు
అంతం వచ్చేదాకా
అహంకరించారు
వాళ్ళ అరాచకాలను
కిరాతకాలను
రాక్షసత్వాలను
క్రూరసత్వాలను
చరిత్రలో చిత్రించింది కాలం
తరతరాలకు చాటింది
ఉదాహరణలుగా చేసింది
కథలు కథలుగా చెప్పింది !

దుర్మార్గం ఎక్కడికి దారితీస్తుందో
దౌర్జన్యం ఏమయిపోతుందో
అంతం ఎంత ఘోరంగా ఉంటుందో
అందరికీ అర్థమయ్యేలా చేసింది!
రావణుడైతే ఏమవుతాడు ?
రాలిపోతాడు చివరికి.
హిట్లర్ అయితే ఏమవుతాడు ?
కూలిపోతాడు ఆఖరికి.
కాలం చెప్పే సత్యాలను
కాదనటానికి వీల్లేదు.
చరిత్ర చెప్పే వాస్తవాలను
మరిచి ప్రవర్తించటం కూడదు !

మానవతాగుణాలను మరవనివాళ్ళు
సామాజికనియమాలను తప్పనివాళ్ళు
కాలాన్ని అర్థం చేసుకున్న వాళ్ళు
చరిత్ర పరమార్థం తెలుసుకున్న వాళ్ళు
వాళ్ళే సన్మార్గులంటే
వాళ్ళే సజ్జనులంటే
వాళ్ళే దార్శనికులు
వాళ్ళే కాలజ్ఞానులు

వాళ్ళ మార్గమే
అనుసరణీయమంటుంది కాలం !
వాళ్ళ మాటలే
ఆచరణీయమంటుంది !
మనిషి నడవాల్సిన మార్గాన్ని
ఆ మహాత్ముల ద్వారా నిర్దేశిస్తుంది!
ఆదర్శజీవితాలను
నిదర్శనంగా నిలుపుతుంది
కాదని తోవ తప్పితే
కావరంతో శిరసెత్తితే
గతం కథల్ని చెబుతుంది
పతనం తప్పదని హెచ్చరిస్తుంది
చరిత్రను వివరిస్తుంది
పరివర్తన రావాలంటుంది
కాదని గర్వపడ్డారా
కాలం పునరావృత్తమవుతుంది
లోకకంటకులు
కాలగర్భంలో కలుస్తారు
లోకం
ముందుకు నడుస్తూనే ఉంటుంది !

ఐదో చరణం

మనిషి కళ్ళల్లో వెలుగు నింపుతున్న
ఈ తారకల కాంతిప్రస్థానం
ఎన్ని కోట్ల సంవత్సరాలది?
మాయజలతారు లాంటి
మోహనమైన ఈ వెన్నెల
ఎప్పటి నుంచి మానవుని గుండెల్లో
కురుస్తున్నది?
మహోన్నతుడయ్యే మనిషికి ఆదర్శమైన
ఈ పర్వతాలు
శిరసెత్తుకుని నిలబడి
ఎన్నేళ్ళయ్యింది ?
నిర్నిద్ర గంభీరముద్రను నేర్పే
ఈ సముద్రాలు
అలలనోరెత్తి
హోరెత్తిపోవటం ఎప్పట్నుంచి?
హృదయాన్ని పులకింపచేసే
ఈ వన్నెవన్నెల చిన్నిపూలు
వికసించటం
ఎప్పుడు ప్రారంభమయింది ?

గుండెగుండెను సంధించే
ఈ పరిమళాలకూ పవనాలకూ
అవినాభావ సంబంధం
ఎప్పుడు మొదలయ్యింది ?

ఈ ఆకుల్లోని హరితం
ఈ పుష్పవర్ణ సంభరితం
ఈ తరులతల
కమనీయసాన్నిహిత్యం
ఈ పక్షుల పక్షాల
రంగుల విచిత్రం
ఈ విశాలాకాశపు
వినీలమనోహరత్వం
ఈ జలపాతాల
లయల హొయల రామణీయకత్వం
ఈ కలకలరావాల మృదుగీతం
ఈ గలగల నాదాల సంగీతం
ఎప్పుడు ఎలా పుట్టింది?
ఎప్పట్నుంచి
ఈ ఇలను ఇలా మైమరపిస్తున్నది?
కాలమే ప్రత్యక్షసాక్షి
కాలానికి తెలుసు జవాబులు !

భయోద్విగ్నమైన రాత్రులగుండా
ధైర్యలగ్నమైన పగళ్ళగుండా
కఠోర షడ్జమాలనే కాదు
కమ్మని పంచమాలను వింటూ
కుటిల కుంఠిత కంటక మార్గాలనే కాదు
సుందర నందనారామ స్వర్గాలను దాటుకుంటూ
నిరంతరంగా కదులుతూ ఉన్న
పంచభూతాల సంచలన ప్రకృతికి
సాక్షిగా మెదలుతూ ఉన్న
కాలం అనుభవాలెంత
అపురూపమైనవో కదా !
కాలం అనుభూతులెంత
అనంత చిరంతన రసప్రవాహాలోకదా !
కాలానికి తెలియని విషయాలుంటాయా?
మనిషికేం తెలుసు ?
మొన్నపుట్టి
నిన్న కళ్ళు తెరిచాడు !
ఆదిమానవుడై
అనాగరకుడై
ఆటవిక దశలో నుంచి
ఆధునికానికొచ్చాడు !

ఇప్పుడు

అనురాగాల్ని ఆత్మీయతల్ని

సౌహార్ద్రాల్ని సౌజన్యాల్ని

గౌరవభావాల్ని వాత్సల్యాల్ని

మనిషి మరువకూడని

మానవత్వాన్ని

తుంగలో తొక్కి

గంగలో చేతులు కడుక్కుంటున్నాడు !

ఇప్పుడిక మనిషి

తనను తాను తెలుసుకోవటానికే

తలమునకలై పోతున్నాడు !

అతని పరిశోధనలు

నేల విడిచిన సాము కాకూడదు

అతని విజయాలు

మానవత్వాన్ని ప్రేమతత్వాన్ని

ఉన్నతశిఖరాల మీద నిలపాలి

ఉద్దీపించేవిగా ఉండాలి!

కనికరం లేదు కాలానికి !

కరడుగట్టిన పదార్థమా కాలం ?

కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నానంటూ

కఠినంగా వ్యవహరిస్తుంది!

నిజంలో జీవించటమే

నా నైజమంటుంది !

నిష్కర్షగా వ్యవహరించటమే

నాకు సహజమంటుంది!

కొంతకాలం

హాయిగా నడిపిస్తుంది మనిషిని

అంతలోనే

హఠాత్తుగా ఆవేదన రగిలిస్తుంది!

తేలికగా ఉన్న గుండెమీద

తెచ్చివేస్తుంది టన్నుల బరువును !

క్షణక్షణం వేడి నిట్టూర్పులతో

గుండెను పొగిలిస్తుంది

భవిష్యత్తును శూన్యం చేస్తుంది

ఆలోచనల్ని ఆవిరి చేస్తుంది

అనంతదుఃఖసముద్రంలోకి

అలవోకగా నెట్టేస్తుంది!

అంతలోనే పంథా మారుస్తుంది.
సమస్యలవలయాల్లో
విలవిలలాడే మనిషికి
ఊరటనిచ్చి
కళకళలాడేలా చేస్తుంది!
కొండంత బరువును
దూదిపింజలా మార్చేస్తుంది
అలమటించే గుండెకు
హాయిని మలాము చేస్తుంది !

ఎప్పటికీ ఒకేలా ఉండనివ్వదు
ఎన్నటికీ తన అంతు చిక్కనివ్వదు
కాలం బలీయం అనిపిస్తుంది
చేయవలసిందేనంటూ చేసుకుపోతుంది!
ఏమిటో ఈ కాలానికున్న శక్తి !
ఎలాంటిదో ఈ కాలానికున్న యుక్తి !
మనిషికి తెలిసీ తెలియకుండ ఉంటుంది
స్పష్టాస్పష్టంగా బుద్ధికి తోస్తుందెప్పుడు
ఆవేదనల
ఆనందాల
అనుభూతులివ్వటం
ఈ కాలం చేతిలో ఉంటుందా ?

ఆవేదనను
ఎంతకాలం అనుభవించాలో
ఆనందంతో
ఎంతకాలం ఉండాలో
నిర్దేశించే సూత్రం
ఈ కాలానిదేనా ?
నిర్ణయించేది మాత్రం
ఈ కాలమేనా?
మనిషి
ఎప్పటికీ కాలం చేతిలో
కీలుబొమ్మేనా?
ఎప్పుడూ కాలం కనుసన్నల్లో
కదలటమేనా ?
కాలాన్ని గమనించి గమనించి
కాలాన్ని పరిశీలించి పరిశీలించి
కాలాన్ని అర్థం చేసుకుని అర్థం చేసుకుని
కాలాన్ని జయించటానికి
నిశ్చితంగా ప్రయత్నించలేదా ?
నిర్భయంగా ఉద్యమించలేదా?
కాలం తత్త్వం తెలుసుకోలేదా ?
అసలు సత్యం పూర్తిగా తెలుసుకోలేదా ? !

మనిషి ఎంత అశక్తుడో
కాలం గుర్తుచేయాలనుకుంటుందేమో!
కడగండ్లలో ముంచటానికి
కనికరంలేకుండా సిద్ధమౌతుంది!
అసంతృప్తులవలను విసరటానికి
అలసటలేకుండా పనిచేస్తుంది!
ఆవేదనలపాశం వేయటానికి
అహర్నిశలు కృషి చేస్తుంది!
పువ్వై నవ్వుతూ ఉంటే
రాల్చేస్తుంది ఆనందం తొడిమనుంచి!
గువ్వై ఎగురుతూ ఉంటే
కూల్చేస్తుంది స్వేచ్ఛావిహాయసం నుంచి!
పసిపాపగా మిగులుదామంటే
కసిగా పెంచేస్తుంది వయస్సును!
ఏ పని చేసినా చేయకున్నా -
కూర్చున్నా నిలబడినా -
రాత్రనకా పగలనకా -
ఖర్చయి పోతూనే ఉంటుంది!
అంతు చూసేవరకూ
పంతం విడువకుండా ఉంటుంది!
అంతా అయిపోయాకా
హాయిగా కదలిపోతూనే ఉంటుంది!

తరతరాలుగా
యుగయుగాలుగా
కష్టాలకూ కన్నీళ్ళకూ ఆలవాలం
అందుకే కాలం
మనిషి గుండెలో గాలం!

విశ్వాసం విద్యుత్తై
ఉత్సాహాన్ని వెలిగిస్తుంది మనిషిలో!
అందుకోదలచిన విజయం కోసం
అహోరాత్రాలు పోరాడుతాడు.
కొండల్ని పిండిచేస్తాడు
కోరిక ఫలించదు!
కష్టించి పనిచేస్తాడు
ఇష్టమైనది లభించదు!
కలకాలం కృషిచేస్తున్నా
కలుగదు విజయం!
కాలం అనుకూలిస్తేనే
కడకు లభిస్తుంది జయం!
కాలం కలిసొస్తేనే
కలలు కూడా నిజాలవుతాయి!
కాలం కరుణించకుంటే
నిజాలు కూడా నిర్వీర్యమవుతాయి!

దాటివచ్చిన మైలురాళ్ళను వెనుదిరిగిచూస్తే
అప్పడే ఇన్నిదాటామా అనిపిస్తుంది!
నడిచిన దారంతా
ఒక్కసారి కనుచూపుమేరలో ఒదిగి
సంక్షిప్తంగా కనిపిస్తుంది !
జీవనలాలసతో
దీర్ఘకాలం హ్రస్వమై పోతుంది!
విడివడని పాశాల్లో బందీలైనా —
'నా' అనే అనుబంధంలో మునిగినా —
మృత్యువున్నదనే సత్యాన్ని మరిచిపోయి
కలసి జీవించటానికి మరిగినా —
ఎప్పటికీ ఇలాగే ఉంటే
ఎంత బాగుంటుందని ఆశించినా —
కాలం ఒప్పకోదు
కాబోలని తప్పకోదు !
తీపి బంధాలను
పాపుకొని తీసికెళుతుంది !
విలవిలలాడే కళ్ళల్లో
మిలమిల మెరిపిస్తుంది
వేదాంతాన్ని !

మనిషిలో
రగిలిన పగల్ని —
మిగిలిన ద్వేషాల్ని —
రోజురోజుకూ తగ్గించి
రాజుకోకుండా చేస్తుంది కాలం !
ఆవేదనలనైనా —
ఆనందాలనైనా —
కొంతవరకే కొనసాగించి
అంతలోనే అయిపోగొడుతుంది!
బతకాలని ఆశపడ్డప్పడు
భంగపాటు కలిగిస్తుంది !
చావాలని ఏడుస్తున్నప్పడు
జీవించాలని నిర్ణయిస్తుంది!
అర్థం కాకుండా నడుస్తూ కాలం
అద్భుతాలు చూపిస్తుంది మనిషికి !

కాలం రచించిన ఒక పాత్రే
మానవ మాత్రుడు!
అతడు ఒప్పకున్నా
ఒప్పకోకపోయినా
అతని జీవయాత్రను
నియంత్రించేది కాలసూత్రమే!

అలా అనంతంగా పరుచుకున్న
ఆద్యంతరహిత కాలరేఖలో
ఎక్కడో
రెండు సమీపబిందువుల
మధ్యదూరమే
మనిషి జీవితం !
జననం
మరణం
ఇవి కాలానికి ముడిపెట్టిన
రెండు కొనలు !
తనకున్న కాలజ్ఞానావగాహనతోనే
జీవితాన్ని నడిపిస్తాడు మనిషి
సన్నివేశాలకూ
సంఘటనలకూ
మలుపులకూ
మంచి చెడ్డలకూ
కాలంతో లంకె పెట్టందే
కాలంతో సమన్వయం చేసుకోందే
కాలం కొలమానంతో కొలవందే
కాలుకదపడు
ముందుకు!

దేవుడు కాలస్వరూపుడు
మృత్యువుకు మరోపేరు కాలుడు
కాలపాశం చుట్టుకుంది
కాలం ఆసన్నమయింది
కాలం మూడింది
కాలధర్మం చెందాడు
కాలం బలీయం
కాలానికి ఎదురీత
కాలపరీక్షలో నెగ్గాలి
కాలమే జవాబు చెబుతుంది
కాలమే జయిస్తుంది
మంచిగా కాలమయింది
గడ్డుకాలమొచ్చింది
అతని టైం బాగుంది
కాలం కలిసొచ్చింది
కాలం అనుకూలంగా ఉంది
అంతా కాలమాహాత్మ్యం
ఇదంతా కాలవైపరీత్యం —
ఇలా కాలప్రభావం ...
మనిషి బతుకులో మరువరాని అంశమయింది !
అడుగడుగునా ప్రత్యక్షమయ్యే
అదృశ్యశక్తిగా మారింది!

కాలం
వైపరీత్యాల్ని సృష్టిస్తుంటే
మనిషి
సత్యాలు తెలుసుకుంటున్నాడు !
విషమస్థితిని గెలవటానికి
విధిగా పోరాడాలని
దృఢసంకల్పదీక్షతో
అడుగు ముందుకు వేస్తాడు !
పిడికిలి బిగించి
నడుం కట్టి
పెనుశక్తిగా మారతాడు !
వివేచన పెంచి పెంచి
విజయం సాధిస్తాడు !

మానవుని విజయాల వెనక
మహాశక్తి కాలం !

దేవుడు కాలస్వరూపుడు
మృత్యువుకు మరోపేరు కాలుడు
కాలపాశం చుట్టుకుంది
కాలం ఆసన్నమయింది
కాలం మూడింది
కాలధర్మం చెందాడు
కాలం బలీయం
కాలానికి ఎదురీత
కాలపరీక్షలో నెగ్గాలి
కాలమే జవాబు చెబుతుంది
కాలమే జయిస్తుంది
మంచిగా కాలమయింది
గడ్డుకాలమొచ్చింది
అతని టైం బాగుంది
కాలం కలిసొచ్చింది
కాలం అనుకూలంగా ఉంది
అంతా కాలమాహాత్మ్యం
ఇదంతా కాలవైపరీత్యం _
ఇలా కాలప్రభావం ...
మనిషి బతుకులో మరువరాని అంశమయింది !
అడుగడుగునా ప్రత్యక్షమయ్యే
అదృశ్యశక్తిగా మారింది!

సాయంకాలం
రాహుకాలం
చలికాలం - ప్రళయ కాలం _
ఇలాంటి అన్ని సందర్భాల్లో
జీవితసర్వస్వం మీద
కాలం ముద్రలు
కాదనలేని వాస్తవాలు !
కాలచక్రానికి అనుగుణంగానే
జీవితచక్రం నడుస్తుంది !
కాలమార్గం మధ్యలో
ఎక్కడో పుట్టి
కాలంతో కలిసి నడుస్తాడు మనిషి
గమ్యం చేరినా చేరకపోయినా
కాలం తీరిన మరుక్షణం
అంతమయిపోతుంది అతని జీవితం !
అయినా
కాలానికి అంతంలేదు
కాలం
గమిస్తూనే ఉంటుంది కలకాలం !
మనిషి ఆకులా రాలిపోతాడు
కాలం మహావృక్షంలా
జీవచలనంతో పచ్చగా నిలుస్తుంది !

ఆరో చరణం

నడుస్తున్న దారిలో
పూలతోటలే కాదు
ముళ్ళబాటలు కూడా
ఎదురవుతుంటాయి
ఉన్నతశిఖరాలే కాదు
అగాధమార్గాలూ ఉంటాయి
మంచు కురిసే గడియలే కాదు
మంటలు ఎగిసే రోజులూ ఉంటాయి !

అమాయకత్వం మీద
అమానుష గర్జనలు
మానత్వం మీద
రాక్షసత్వపీడనలు
విన్యాసాలు చేసేటప్పుడు
అన్యాయాలు జరిగేటప్పుడు
అనుచితాలు మితిమీరినప్పుడు
ప్రశాంతి గతితప్పినప్పుడు
అరాచకాలను అదిమివేయటానికి
దౌర్జన్యాలను అదుపు చేయటానికి
కాలం ప్రత్యక్షమౌతుంది!
కావలసిన మార్పులు చేసేస్తుంది!

కాలం బలమేమిటో
కనిపెట్టలేని నికృష్టశక్తులు
ఎదురులేదు మాకని
ఏం చేస్తుందిలే కాలమని
కాలం మా అధీనమని
విర్రవీగి విజృంభిస్తారు!
అన్నీ గమనించి కాలం
అనివార్యంగా శిక్షిస్తుంది చివరికి
పెరుగుట విరుగుటకొరకేనని
పెదవి విప్పకనే చెప్పేస్తుంది!

కాలానికి తెలుసు
జ్వాలలై మండించే
దుష్టత్వ దౌర్జన్యాల
నికృష్ట అరాచకాలను గురించి _
కాలానికి తెలుసు
అంతమయ్యే దాకా
పంతం మానకుండా
విజృంభించే పశుబలం సృష్టించగల
విషమగడియల్ని గురించి _

కాలానికి తెలుసు
దారిపొడవునా
కార్చిచ్చై రెచ్చిపోయే
అన్యాయాక్రమాల
అకారణప్రళయాన్ని గురించి _

కాలిపోతున్న
పూలగుండెల్ని చూసి
జాలిపడి
కలవరపడుతుంది కాలం!
విచ్చిన గుచ్ఛాల
పచ్చని వృక్షాలు
చిచ్చుకు బలవుతుంటే
నొచ్చుకుంటుంది కాలం !
తీయని నాదాలతో
అలరించే వంశీలను
ఆరనిమంటలు కబళిస్తుంటే
ఆందోళనపడుతుంది కాలం!
డేగల వేటలో
గద్దల బాటలో
పాలపిట్టలు
నేలకూలుతుంటే _

చిలుకల పలుకులు
వికలమవుతుంటే _
కలరావాల కోకిలలు
విలవిలపోతుంటే _
కాలిన వనాల పంచన
వేడి పవనాల అంచున
సీతాకోకచిలుకలు
వెతలతో
సతమతమవుతుంటే -
సాక్షీభూతమైన కాలం
ఉపేక్షిస్తుందా ఇంకా ?
ఊరుకుంటుందా ఇంకా?
దౌర్జన్యాల అంతం చూసేదాకా
సౌజన్యాల సంతసం వెలిగించేదాకా
ఆగుతుందా ఇంకా ?
భీష్మమైన గ్రీష్మదావాగ్నుల్ని
ఎంతకాలం సహిస్తుంది కాలం?
సహించి సహించి దహించే గుణాన్ని
సమూలంగా చల్లారుస్తుంది !
కాలం వర్షధారాహతికి
అనలార్భాటాలు
అణగారిపోక తప్పదు !

శిశిరాలు
ముకుళింప చేసినంత కాలం
చూసి చూసి విసిగిన కాలం
వసంతోత్సాహంతో
ఉల్లాసాన్ని విరబూస్తుంది !
కోకిల పాటలతో
చిలుకల పలుకులతో
పాలపిట్టల
అపురూప దర్శనాలతో
సీతాకోకచిలుకల
చిత్రాగమనాలతో
హరిత తరులతలతో
విరుల పరిమళాలతో
భ్రమర ఝుంకారాలతో
ప్రకృతినే
వంశీగా మలచి
పాడుతుంది కాలం !
జగదానంద గీతాలతో
జాగృతిని కలిగిస్తుంది!

ప్రకృతిలో
సమతౌల్యం దెబ్బతిందా ?
ప్రత్యణువునా అలజడి !
మనుషుల్లో
ఈక్వేషన్స్ మారాయా ?
అనుకున్న అభిప్రాయాలు తారుమారు !
అవగాహనలో మార్పులు
అర్థం చేసుకోవటంతో చేర్పులు
మంచీ చెడ్డా
ప్రేమా ద్వేషం
మిత్రత్వం శత్రుత్వం
అన్నీ వ్యత్యస్తం
అవి ఆచరణలో ప్రత్యక్షం !
అతడు ప్రేమతో పలకరించాడు ఇతణ్ణి
ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు
ఆత్మీయంగా వ్యవహరించాడు
ఆనందాన్ని వాతావరణంలో నింపాడు
ఇదేంటని ఆశ్చర్యపోయినా
అనుకోని సంఘటనకు అబ్బురపడ్డా
అతనిలా ఇతడూ స్పందించాడు.

ఒకప్పుడు ఇతడంటే
అగ్గిమీద గుగ్గిలం అయ్యేవాడతడు
కళ్ళనుంచి నిప్పుకణాల్ని రాల్చేవాడు
ఎత్తులు పన్నేవాడు
కత్తులు దూసేవాడు
శ్రేయోభిలాషులు ఈ ఇద్దర్నీ కలపాలని చూస్తే
ఛీత్కరించాడు
తిరస్కరించాడు !
అలాంటివాడిప్పుడు -
స్నేహహృదయంతో
చేతులు చాచాడు !
ఆర్ద్రభావనతో
మనసు విప్పాడు !
అరమరికలు లేకుండా ఇతడు కూడ
అతణ్ణి ఆహ్వానించాడు !
కాలం ఇద్దరి మనసుల్ని మార్చేసింది
సహృదయతను లోలోన తీర్చింది
ప్రేమామృతాన్ని సంతరించింది
కోపానలాన్ని చల్లార్చింది !

కాలానికే ఉన్న మహిమ ఇది !
ఎవరికీ లేని గరిమ ఇది !
కరకుశిలల్ని నునుపు చేసే
ప్రవాహం లాంటిది కాలం !
శిలలాంటి హృదయాన్ని కరిగించే
సంగీతం లాంటిది
మోడుగా మిగిలిన మాకును చిగిర్చే
వసంతం లాంటిది !
అంబరమంటిన అగ్నిజ్వాలల్ని ఆర్పివేసే
అంబుదం లాంటిది !
కఠిన చిత్తాలను
మెత్తబరిచే నేర్పు కాలానిది
క్రోధావేశాలను
కూల్చివేసే ఓర్పు కాలానిది!
మనిషి బతకాలంటే
మార్పు కావాలంటుంది
మనిషి బతకాలంటే
మరపు కావాలంటుంది
మనిషికి కాలమిచ్చిన వరాలవి!
జీవనగమనానికి అవసరాలవి !

కాలం _ ఎక్స్‌రే కళ్ళతో తనలో
నిక్షిప్తంచేస్తుంది జీవితాల్ని.
జీవితచిత్రాల్ని
భావికాలాలకు భద్రం చేస్తుంది.
భూతకాలపు మైలురాళ్ళను
చూపులపుటల్లో దర్శింపచేస్తుంది.
గతంలో చేసిన పొరపాట్లకు
శిక్షవేయటానికి
సిద్ధపరుస్తుంది పరిస్థితుల్ని.
ఇతరులనెలా నొప్పించాడో
అదే దృశ్యాన్ని
అతనికీ ప్రవర్తింపచేస్తుంది.
అంతవరకూ
కాలంలో వేలాడుతున్న
గతంలో చేసిన తప్పిదం
గాలంలా
అతని గుండెకు గుచ్చుకుంటుంది.
గుండెమంటలను ఆర్పటానికి
పెల్లుబికిన బాష్పప్రవాహాలు
కళ్ళల్లోనే ఆవిరైపోతుంటాయప్పుడు!

గుండెను తొలిచే నిరంతరవేదన
బండబారుస్తుంది అతని జీవితాన్ని!
మాటల్ని లాక్కుని రియలైజేషన్
మథనపడటాన్ని ప్రెజెంట్ చేస్తుంది!
ఎప్పుడు
పశ్చాత్తాపం ప్రారంభమౌతుందో
అప్పుడు
ప్రత్యక్షమౌతుంది క్షమార్హత !
మౌనంగా చూస్తున్న మూగకళ్ళలోని
నీలినీలి నీడలపైన
అప్పడే మొలకెత్తుతున్న
కాంతికిరణాలు
అహంకారాన్ని కూల్చివేస్తుంటాయి !
అజ్ఞానాన్ని కాల్చివేస్తుంటాయి !
బీడులా మారిన మనిషి
ఫలించటానికి
మళ్ళీ కృషి మొదలు పెట్టవలసిందే !
మోడులా మారిన మనిషి
చిగురించటానికి
మళ్ళీ సమాయత్తం కావలసిందే !

ఎదుటివ్యక్తిని పరివేదనకు గురిచేసిన
గుండెను పిండే ఆ దృశ్యాలు
గుర్తొచ్చినప్పడల్లా
పశ్చాత్తాపహృదయానికి
అవి కన్నీళ్ళై ఉబికి వస్తాయి !
చెవులను మెలేసే ఆ మాటలు
ఈటెల్లా మరోమారు లోలోన గుచ్చుకుంటాయి !
ఆ ప్రవర్తనాశకలం దారిపొడవునా
జీవితసకలాన్ని
ఎగతాళి చేస్తూ ఉంటుంది !
ఇది అసహనం - ఆగ్రహం - ఆవేశం
పుట్టించిన ముసలం !
అనాలోచితపు చేష్ట !
అంతరాళంలో నిరంతరం కొనసాగే
దుఃఖాశ్రువుల ప్రవాహం !
ఇప్పుడు కాలం
గాయానికి పశ్చాత్తాపం మందుపూసి
బాధాతీవ్రతను బాగా తగ్గించి వేస్తుంది !
పీడల సమాధి మీద
అనుభవలతికకు ఆలంబనమవుతుంది !
జ్ఞానపుష్పాలను పూయటానికి
అవగాహనల మొగ్గలు తొడుగుతుంది !

మనిషి -
ఆదిమకాలం నుంచి
తన మేధస్సుకు
కాలం గీటురాయిమీద
పదును పెట్టుకుంటూ వస్తున్నాడు.
పాతలో కొత్త కలుపుకుంటూ
వేయి విధాలుగా
వికాసాన్ని ఆవిష్కరిస్తున్నాడు.
వెలుగులను పట్టుకుంటూ
చీకట్లను పోగొట్టుకుంటూ
నవజీవన విన్యాసాలతో
నవీనయుగంలో అడుగు పెట్టాడు !
కాలం —
ప్రకృతిని కాపాడాలనుకుంటుంది
ప్రకృతిని వికృతి చేస్తే
ప్రళయాలను సృష్టిస్తుంది !
ప్రకృతిని జయించాలనే పట్టుదలతో
తెగేందాక లాగుతాడు మనిషి.
నది ఒడ్డు మీద నివసిస్తానంటాడు
నగరాలను నిర్మించుకుంటాడు.

నదుల అమృతజలాలను
నగరాలతో కలుషితం చేస్తాడు
అడవిలో ఉండమంటారా అతణ్ణి
పడిఉండకుండా పనితనం చూపుతాడు.
నట్టడవిలో
నగరాలను నిల్పుతాడు !
దట్టమైన అడవిని
చెట్టులేకుండా చేస్తాడు !
నగరకాలుష్యాన్ని
నదిలో కలపటమే కాదు
గాలిని గరళతుల్యం చేస్తాడు !
పుట్టించిన కాలుష్యాన్ని
తుదముట్టించలేకపోతున్నాడు!
ఎక్కడ నిలబడతాడో
అక్కడ తన ముద్రవేస్తాడు !
సముచితపరిణామాలు
మానవవికాసానికి దోహదాలు.
సంక్లిష్టపరిణామాలు
భావితరాలకు ప్రమాదాలు.

ఇప్పుడువేసే
విజయముద్రలు
రేపటి వారికి
అడుగుజాడలు !
ప్రకృతిని జయిస్తుంటే
పరమానందంగా ఉంటుందేమో కాని
పర్యావరణాన్ని పాడుచేస్తే
ప్రకోపిస్తుంది కాలం !
తనతో కలసి నడుస్తున్న మనిషినైనా
కనికరించదప్పుడు !
ఆత్మీయంగా ఒదిగి ఉన్న కాలమే
అంతరాలేమిటో చూపుతుంది !
అనంతశక్తిగా అవతరిస్తుంది !
నిగ్రహం కోల్పోయి
ఆగ్రహంతో
ఉగ్రరూపమెత్తుతుంది!
అప్పుడు -
మనిషి పరిస్థితి
మళ్ళీ మొదటికొస్తుంది !

కాలం _
పదవికోసం వాడు పడ్డ పాట్లను
పెదవి విప్పకుండా గమనించింది !
పెట్టరానివి వాడు పణంగా పెడుతుంటే
పట్టనట్లు చూస్తూనే ఉంది !
పొందిన పదవిమీద కూర్చుని వాడు
ఎందరో సమర్థుల్ని తూలనాడుతుంటే
అప్పటికీ కిమ్మనకుండా
తప్పులను లెక్కిస్తూనే ఉంది!
పదవిని స్వార్థానికి ఉపయోగించుకుంటుంటే
నిదానంగా పరిశీలిస్తూనే ఉంది !
అక్రమంగా సంపాదించుకుని
విక్రమార్కుణ్ణని కాలర్ ఎగురవేస్తుంటే
చిరునవ్వు నవ్వుతూ వాణ్ణి
చిత్రంగా చూస్తుంది !
సమయం వచ్చేసరికి
సాగనంపింది ఇంటికి!
అధికారాంతంలో
ఒంటరివాడైన ఆ తుంటరికి
కంటనీరే మిగిల్చింది !
కాలం శక్తిని మరిచినవాడు
కలకాలం పదవి ఉంటుందనుకున్నాడు !

ఇంద్రుణ్ణే నేనని
విర్రవీగిన వాణ్ణి
ఈడ్చి లెంపకాయ కొడుతుంది కాలం !
చంద్రుణ్ణే నేనని
మిడిసిపడేవాణ్ణి
చాచి మొట్టికాయ వేస్తుంది !
దొడ్డవాణ్ణి నేనని
గర్వపడ్డవాణ్ణి
నడ్డి విరుస్తుంది నిర్దయగా !
'నాకెవరు సాటిరా' అని
ధిక్కరించేవాణ్ణి
'నీవేపాటిరా' అని
అణిచివేస్తుంది గట్టిగా!
అహంకారంతో
హద్దుదాటి ప్రవర్తిస్తే
మమకారం లేకుండా
సైజ్ కట్ చేస్తుంది !
గోరంతల్ని కొండంతలు చేసేవాణ్ణి
నేరుగా అడుగుకు నెట్టేస్తుంది !
మౌనంగా పనిచేసుకుపోయేవాణ్ణి
ఘనంగా సన్మానిస్తుంది !

హద్దుల జెండాలు పాతి
అవని అంతా నాదేనన్న మనిషి
భూకంప ప్రకోపంతో
కొంపలు కూలిపోతుంటే _
ఎక్కడి వాళ్ళక్కడ రాలిపోతుంటే _
భూమి ముందు
తానెంత అశక్తుడో తెలుసుకుంటాడు !
సముద్రం పైనా లోనా
సర్వాధిపత్యం నాదేనని
గర్వపడ్డ మనిషిని
నిర్వీర్యం చేయటానికి
సునామీగా
ఉప్పెనగా
జలవిలయం కప్పేస్తే _
విలవిలలాడుతూ
తన బలహీనతలేమిటో తెలుసుకుంటాడు !

అగ్నిగిరుల లావా ప్రవాహానికి
శలభంలా తల్లడిల్లినప్పుడు
తానెంత శక్తిమంతుడో
తరచి చూసుకుంటాడు!
అతివృష్టికి అనావృష్టికి
అలమటించేటప్పుడు
నిస్సహాయస్థితిలోని
నిజం తెలుసుకుంటాడు!

విజయాలు సాధిస్తూ సాధిస్తూ
విర్రవీగుతాడేమోనని _
అపజయాల అనుభవాలే
విజయానికి సోపానాలవుతాయని _
పరిస్థితుల మీద
పట్టు సడలుతున్నప్పుడు
ప్రబలంగా నిలువటానికి
పట్టుదల పెరగాలని _

అవసరాలను తీర్చే అన్వేషణ
అహర్నిశలు సాగాలని _
కాలం
మనిషిని పరీక్షించి
కళ్ళు తెరిపిస్తుంది కాబోలు!
మేధస్సును కవ్వించి
తేజస్సువైపు ఆకర్షిస్తుంది కాబోలు!
వైపరీత్యాలను కలిగించి
ప్రత్యామ్నాయాలను వెదికిస్తుందేమో!
అపాయాలను అధిగమించే
ఉపాయాలను పుట్టిస్తుందేమో!
అందుకేనేమో _
ప్రకృతిని ప్రేరేపించి
ప్రళయం సృష్టిస్తుంది!
అప్పుడు హడలెత్తిన మనిషి
అర్థం చేసుకుంటాడు కాలాన్ని!

కాలం
వైపరీత్యాల్ని సృష్టిస్తుంటే
మనిషి
సత్యాలు తెలుసుకుంటున్నాడు !
విషమస్థితిని గెలవటానికి
విధిగా పోరాడాలని
దృఢసంకల్పదీక్షతో
అడుగు ముందుకు వేస్తాడు !
పిడికిలి బిగించి
నడుం కట్టి
పెనుశక్తిగా మారతాడు !
వివేచన పెంచి పెంచి
విజయం సాధిస్తాడు !

మానవుని విజయాల వెనక
మహాశక్తి కాలం !